ప్రజాశక్తి
బుధవారం 1 ఫిబ్రవరి 2023 8 పేజీలు
ప్రకాశం బాపట్ల







ప్రజలతో మాట్లాడుతున్న మంత్రి సురేష్

## సిఫార్సులు లేకుండా సంక్షేమ పథకాలు

రాష్ట్ర మంత్రి సురేష్

▲ 8లో

## అధికార పార్టీ కౌన్సిలర్ల నోటికి తాళం.!

అసహనంతో కౌన్సిల్ సమావేశాలకు డుమ్మా

▲ 8లో

# పెత్తందార్ల దాష్టీకం

- ఆర్‌సి భూములు సాగు చేసుకుంటున్నా ఓర్చుకోలేని వైనం
- వంద మందికి పైగా వచ్చి.. కత్తులు, కర్రలతో హత్యాయత్నం
- ఆసుపత్రి పాలైన ముగ్గురు దళితులు
- ప్రేక్షకపాత్ర వహించిన పోలీసులు



న్యాయం చేయాలని రోడ్డుపై బైటాయించి.. నిరసన తెలుపుతున్న దళితులు.. ఇన్‌సెట్లో ఒంటిపై దెబ్బలు చూపిస్తున్న బాధితుడు

**ప్రజాశకి-కొల్లూరు (బాపట్ల జిల్లా)**


పెత్తందారుల దాష్టీకం పరాకాష్టకు చేరింది. దళితులు ఆర్‌సి (నదీపరివాహక) భూములను సాగు చేసుకొనేందుకు ప్రయత్నించడాన్ని కూడా సహించలేకపోయారు. ఆర్‌సి భూములను కాజేయాలనే ఆలోచనతోనే లేక తమ పొలాల పక్కన దళితులు సాగు చేసుకొనేదేంది? అనే అహంకారంతోనే దళితులను చంపాలని కుట్ర పన్నారు. అధికారపార్టీకి చెందిన పెత్తందారులు వంద మందికి పైగా మూకుమ్మడిగా కాపు కాసి దళితులపై పోలీసుల ఎదురుగానే కత్తులతో, కర్రలతో దాడికి పాల్పడ్డారు. నలుగురు దళితులపై దాడికి పాల్పడగా ఒకరికి స్వల్ప గాయాలయ్యాయి. మిగతా ముగ్గురూ తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. పెత్తందారులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టాలని దళితులు రోడ్డుపై బైటాయించి.. నిరసన తెలిపారు.

పోలీసులను సైతం లెక్కచేయకుండా వారి సమక్షంలోనే దళితులపై పెత్తందారులు (కాపులు) కత్తులు, కర్రలతో దాడి చేసిన ఘటన మంగళవారం కొల్లూరు మండలం, అరవింద వారధి వద్ద చోటుచేసుకుంది. కొల్లూరు మండలం చింతల్లంక, పెదలంక గ్రామాల దళితులు సొసైటీగా ఏర్పడి గత ఐదారేళ్ళుగా సమీపంలోని కష్ణా నదిలో మేటవేసిన భూమిని పశువుల మేత కోసం, మరియు సాగు కోసం హక్కు కల్పించాలని అటు అధికారులను, ఇటు ప్రజాప్రతినిధులను కోరుతున్నారు. కానీ ఏ ఒక్కరూ స్పందించకపోవటంతో ఈ రెండు గ్రామాల దళితులు వ్యవసాయ కార్మిక సంఘం, కౌలు రైతుసంఘం ఆధ్వర్యంలో జనవరి ఏడో తేదీ నుండి ఆ భూమిలో ఉన్న పిచ్చికంపను తొలగించేందుకు పూనుకున్నారు. ఈ భూములు ఇప్పించాలని మండల తహశీల్దార్ వద్ద కూడా ధర్నా చేపట్టారు. ఈ నేపథ్యంలో ఆ భూములకు ఏ సంబంధం లేని అధికార పార్టీకి చెందిన పెత్తందారులు ఆ భూములను తామే ఆక్రమించుకోవాలనే ఆలోచనతోనో, లేక తమ భూముల పక్కనే దళితులు ఎందుకుండాలనే అభిప్రాయంతోనో దళితులను ఏదో విధంగా అక్కడి నుంచి తరిమేయాలని నిర్ణయించుకున్నారు. పెసర్లంక, పెదలంక, గాజుల్లంక గ్రామాలకు చెందిన అధికార పార్టీకి నాయకులు సింగం కష్ణప్రసాద్, సింగం శ్రీనివాసరావు, వెలివల బసవరత్తయ్య, ఉప్పు కృష్ణారావు, తోట బసవయ్య, కూరేటి శివయ్య, బావిరెడ్డి లోకనాథం, సగ్గున నగమల్లేశ్వరరావు ఆధ్వర్యంలో వారి అనుచరులు దాదాపుగా ఆయా గ్రామాల నుండి 100 మందికి పైగా ఈ దాడిలో పాల్గొన్నారు. సోమవారం సాయంత్రం మూడు గంటల సమయంలోనే పైన పేర్కొన్న మూడు

▶ 2లో

## కేంద్ర బడ్జెట్‌లో

# జిల్లాకు దక్కేదేంటి?



- అతీగతీ లేని 'జిల్లా వెనుకబాటు' తీర్మానం
- వెలిగొండకు నిధులిస్తే రైతులు,నిర్వాసితులకు ఊరట
- మండూస్‌లో దెబ్బతిన్న పొగాకు రైతులకు భరోసా శూన్యం
- పలు సమస్యలను పార్లమెంటులో ప్రస్తావించిన ఎంపీ మాగుంట

**ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో**

ఒకప్పుడు బడ్జెట్ అనగానే.. ఏ వస్తువు ధర పెరుగుతుంది? ఏ వస్తువుల ధరలు తగ్గుతాయనే దానిపై జనంలో ఆశగా ఉండేది. ఎందుకంటే బడ్జెట్‌లోనే ఈ పెరుగుదల స్పష్టంగా ఉంటుంది. పన్నుల్లో హెచ్చుతగ్గుల వల్లే ఈ మార్పులు కనిపించేవి. ఇప్పుడా పరిస్థితి లేదు. జీఎస్‌టీ వచ్చాక పన్నులు ఎలా కట్టాల్సి వచ్చిందో చెప్పాల్సిన అవసరం లేదు. అయితే బడ్జెట్ అనగానే ఇపుడు కొన్ని కేటాయింపులు.. పెండింగు ప్రాజెక్టులకు నిధులు వంటి ప్రస్తావనే ముందుకు వస్తోంది. కేంద్రం చేసే కొన్ని నిర్ణయాలు ఇక్కడ స్పష్టంగా అనేక రంగాలపై ప్రభావం ఉంటుంది. కేంద్రం నుంచి జిల్లాకు ఏం దక్కుతుందనేదే ఇప్పుడు చర్చగా మారుతోంది. స్థానిక సంస్థలకు కేంద్రం నేరుగా ఇచ్చే నిధులు కూడా ఇప్పుడు ఆ రంగాల్లో వినియోగించడం లేదు. ఆర్థిక సంఘాల నిధులను కూడా పక్కదారి పట్టించారు. ఫలితంగా గ్రామీణ ప్రాంతాల్లో కనీస మౌలిక సదుపాయాల కల్పనకు వెచ్చించే ఆ నిధులు కూడా లేకుండా పోయాయని సర్పంచులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా పునర్విభజన జరిగాక రామాయపట్నం పోర్టు కూడా పక్క జిల్లాకు వెళ్లింది. ఇక జిల్లాలో కేంద్రం నుంచి లబ్ధి పొందే రంగాల్లో పన్నులు తగ్గింపును కోరుతున్నారు. ఎగుమతులపై ఆధారపడిన రొయ్యలు, గ్రానైట్, పొగాకు వంటి ఉత్పత్తులకు ఎగుమతులు రవాణా ఛార్జీలు భారీగా పెరిగాయని వ్యాపారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

– జిల్లాపై కేంద్రం ప్రత్యక్షంగా తీసుకునే నిర్ణయాల విషయానికి వస్తే గతంలో జిల్లాను వెనుకబాటు జాబితాలో చేర్చాలని అసెంబ్లీ నుంచి తీర్మానం కేంద్రానికి చేరింది. దానిపై అప్పట్లోనూ ఇదే ప్రభుత్వం ఉన్నా సానుకూల నిర్ణయం తీసుకోలేదు. ఇప్పటికీ జిల్లా వెనుకబాటుతనం గుర్తింపుపై అతీగతీ లేదు. ప్రజాప్రతినిధులకూ ఈ అంశం పట్టలేదు. ఇప్పుడైనా దీనిపై సానుకూల నిర్ణయం ఉంటే ఎంతోకొంత ఊరట కలుగుతుంది.

– వెలిగొండ ప్రాజెక్టు పనులు

▶ 2లో

## కోల్డ్‌స్టోరేజిలో

# సరుకు మాయం

- తనకు తెలియకుండా శనగలు అమ్మేశాడని శనగ రైతు ఆరోపణ
- 'అన్నదాత కోల్డ్‌స్టోరేజీ' యజమానిపై ఫిర్యాదు..



కోల్డ్‌స్టోరేజీలో సరుకు లేకుండా ఖాళీగా ఉన్న బ్లాక్‌ను పరిశీలిస్తున్న బ్యాంక్ మేనేజర్

**ప్రజాశక్తి-పంగులూరు**

ఆరుగాలం కష్టపడి పండించిన శనగలను గిట్టుబాటు ధర వచ్చినప్పుడు అమ్ముకునేందుకు కోల్డ్‌స్టోరేజ్‌లో పెడితే.. ఆ కోల్డ్‌స్టోరేజీ యజమాని తనకు తెలియకుండానే సరుకు మొత్తం అమ్మేశాడని రేణింగివరం పోలీసుస్టేషన్‌లో మంగళవారం ఫిర్యాదు చేశారు. తన సరుకు తనకు చూపించి ఆదుకోవాలని పోలీసులను కోరారు. రైతు కథనం ప్రకారం.. మార్టూరు మండలం, ద్రోణాదుల గ్రామానికి చెందిన నూల శ్రీరామమూర్తి 2018–19లో శనగ పంటను వేశారు. పండిన జెజె.11 రకం శనగలను మండలంలోని కస్యాపురం గ్రామ సమీపంలో గల అన్నదాత కోల్డ్‌స్టోరేజ్‌లో పెట్టాడు. 60 కిలోల తూకం గల 326 బస్తాలను 192.60 క్వింటాళ్లు, క్వింటా 4 వేల రూపాయలు చొప్పున మొత్తం 7,82,400 రూపాయల విలువ చేసే శనగలను కోల్డ్ స్టోరేజీలో భద్రపరిచారు. ఇందుకుగాను స్టోరేజ్ యాజమాన్యం155 నెంబర్ బాండ్ కూడా ఇచ్చింది. మళ్లీ తర్వాత పండిన జెజె 11 రకం శనగలు 60 కిలోల తూకం గల 353 బస్తాలు మొత్తం 211.80 క్వింటాళ్లు నిలువ చేశాడు. క్వింటాకు రూ.4 వేల చొప్పున రూ.8,47,200 విలువ గల శనగలను అన్నదాత కోల్డ్‌స్టోరేజీలో భద్రపరిచాడు. దీనికిగానూ కోల్డ్‌స్టోరేజ్ యాజమాన్యం 154 నెంబర్ గల బాండు తనకు ఇచ్చారని శ్రీరామ్‌మూర్తి తెలిపారు. ఈ సరుకు బాండ్లపై, స్టోరేజీ స్టోర్‌కీపర్ ఎన్.నేహీమ్యారావు, అప్పటి మేనేజింగ్ డైరెక్టర్ రాయిని వెంకటసుబ్బారావు సంతకం పెట్టారన్నారు. ఈ బాండ్ల ద్వారా గుళ్లాపల్లిలోని సిండికేట్ బ్యాంకు నుండి రూ.9.5 లక్షల

▶ 2లో



బాధిత దళితులను పరామర్శిస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి గంగయ్య

## పెత్తందార్ల దాష్టీకం

**(మొదటిపేజీ తరువాయి)**

గ్రామాలకు చెందిన పెత్తందారులు 300 మందికి పైగా సమావేశం ఏర్పాటు చేసుకొని దళితులపై దాడులు చేసైనా ఆర్‌సి భూముల్లోకి రాకుండా చూడాలని ప్రణాళిక వేసుకున్నారు. ఈ విషయం తెలిసిన పోలీసులు, రెవెన్యూ అధికారులు మంగళవారం అరవింద వారధి వద్దకు చేరుకున్నారు. పైగా పోలీసులే పరిస్థితి విషమించే విధంగా ఉందని దళితులకు నచ్చజెప్పి.. తహశీల్దార్‌కు విన్నవించుకోవాలని సూచించడంతో ఈ రోజు భూముల్లోకి వెళ్లకుండా దళితులంతా రెండు ట్రాక్టర్లు, బైకులపై మండల తహశీల్దార్ కార్యాలయానికి బయలుదేరారు. ఈ క్రమంలో ముందుగా బైకుపై బయలుదేరిన నలుగురు యువకులను అరవింద వారధి వద్ద పెత్తందారులు అడ్డుకొని దాడి చేసి.. హత్యాయత్నానికి పాల్పడ్డారు. ఆ సమయంలో ఉన్న కొద్దిమంది పోలీసులు వందల సంఖ్యలో ఉన్న పెత్తందారులను నిలువరించలేకపోయారు. పైగా అధికార పార్టీకి చెందిన నాయకుల సారథ్యం కావటంతో పోలీసులు ప్రేక్షకపాత్రకే పరిమితమయ్యారు. దాడి విషయం తెలుసుకున్న దళితులు గొడవలు పడటం మంచిది కాదని భావించి బయలుదేరిన ట్రాక్టర్లు నిలిపివేసి.. గాయపడిన వారిని వైద్య చికిత్స నిమిత్తం 108 ద్వారా వైద్యశాలకు తరలించారు.

**న్యాయం చెయ్యాలని బైటాయింపు**

దళితులపై దాడి చేసిన పెత్తందారులపై ఎస్సీ, ఎస్టీ, అట్రాసిటీ కేసు నమోదు చేసి.. న్యాయం చెయ్యాలని డిమాండ్ చేస్తూ దళితులు దాడి జరిగిన ప్రాంతంలోనే రహదారిపై బైఠాయించారు. పెసర్లంక, పెదలంక, గాజుల్లంక గ్రామాల కాపులు దళిత యువకులపై దాడి చేసిన సమాచారం తెలుసుకొని.. రెండు గ్రామాల దళితులు అరవింద వారధి సమీపంలో చింతల్లాంక రహదారిపై బైఠాయించి నిరసన తెలిపారు. పోలీసులు ఉన్నప్పటికీ లెక్కచేయకుండా పెత్తందారులు దాడులకు పాల్పడటం వెనుక ప్రజాప్రతినిధుల హస్తం కూడా ఉన్నట్లుగా దళితులు ఆరోపించారు. న్యాయం జరగకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

**బాధితులకు పరామర్శ**

దళితులపై మంగళవారం దాడి చేసిన పెత్తందారులపై ఎస్‌సి, ఎస్‌టి, అత్యాచార చట్టం కింద కేసు నమోదు చేసి 307 సెక్షన్ ప్రకారం నిందితులను అరెస్టు చెయ్యాలని సిపిఎం బాపట్ల జిల్లా కార్యదర్శి సిహెచ్ గంగయ్య డిమాండ్ చేశారు. దాడిలో గాయపడి తెనాలి ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్న తోడేటి రాజేష్, గుంటూరు ఏసోబు, తోడేటి రవిని ఆయన పరామర్శించారు. ఎస్‌సి, ఎస్‌టి కమిషన్ ఛైర్మన్ బాధిత దళితవాడలను సందర్శించి విచారించాలని కోరారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి టి.కష్ణమోహన్, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి కె.శరత్, నాయకులు సుబ్బారావు, వెంకటరెడ్డి పాల్గొన్నారు.

**ప్రజాసంఘాల ఖండన**

పెత్తందారులకు సంబంధం లేని ఆర్‌సి భూములు బాగు చేసుకునే దళితులపై కుల దూషణతో దాడులకు పాల్పడటం హేయమైన చర్య అని వ్యవసాయ కార్మిక సంఘం, కౌలు రైతుసంఘం, కెవిపిఎస్ నాయకులు టి.కష్ణమోహన్, టి.సురేష్, జి.సుధాకర్ ఖండించారు.

## పొగాకు బ్యారన్ దగ్ధం

**ప్రజాశక్తి-మద్దిపాడు**

పొగాకు బ్యారన్ దగ్ధమైన సంఘటన మంగళవారం వేకువన లింగంగుంట గ్రామ పరిధిలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ఈమని కృష్ణయ్యకు చెందిన బ్యారన్ ప్రమాదవశాత్తూ జరిగినట్లు తెలిపారు. ఒంగోలు నుంచి అగ్నిమాపక సిబ్బంది వచ్చినా ఫలితం లేకపోయింది.

## కేంద్ర బడ్జెట్‌లో జిల్లాకే దక్కేదేంటి?

**(మొదటిపేజీ తరువాయి)**

చివరిదశకు చేరాయి. అయితే దీన్ని వచ్చే సెప్టెంబరులో సిఎం జగన్ ప్రారంభిస్తామని గడువు కూడా పెట్టారు. ఆయనే ఇంతవరకూ ఏడు వేల మందికిపైగా నిర్వాసితులకు ప్యాకేజీలు ఇవ్వలేదు. కొత్తగా లబ్ధిదారులు పెరిగారు. వీరికి కనీసం రూ.1300 కోట్లు వరకూ అవసరమవుతాయని అంచనా. రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయించే స్థితిలో కనిపించడం లేదు. గతంలో వెలుగొండకు కేంద్ర బడ్జెట్‌లోనూ కొన్ని పద్దుల కింద నిధులు చూపారు. ఇప్పుడూ నిధులు కేటాయిస్తే రైతులకు, నిర్వాసితులకు ఊరట కలుగుతుంది.

– దొనకొండ– ఒంగోలు రైల్వేలైను విషయం జనం మరిచిపోయారు. 20 ఏళ్ల దీని కోసం ప్రజాప్రతినిధులు కూడా పోరాడి వదిలేశారు. ఆదాయం లేదనే కారణంతోనే పక్కన పెట్టేశారు. నడికుడి–కాళహస్తి లైను పనులు కొనసాగుతున్నాయి. జిల్లాలో రెండోదశలో దీన్ని చేపడతారు. ఇప్పటికే రహదారులపై బ్రిడ్జీలు కట్టారు. జిల్లాలో ట్రాక్ నిర్మాణ పనులు జరగాల్సి ఉంది. భూసేకరణ కూడా పూర్తయింది. దీని పనులు వేగవంతం చేయాల్సిన అవసరం ఉంది.

– ఉపాధి కల్పించే దొనకొండ, కనిగిరి పారిశ్రామిక వాడలు ముందుకు సాగడం లేదు. ఎప్పటినుంచో ఇక్కడ పరిశ్రమలు ఏర్పాటు చేస్తామనే ప్రకటనలు తప్ప ఆచరణలో ఏ చర్యలూ లేవు. రామాయపట్నం పోర్టుతో ఈ రెండు పారిశ్రామిక వాడలను అనుసంధానం చేస్తున్నట్లు కూడా ప్రతిపాదించారు. సోలార్ ప్రాజెక్టులు వస్తాయన్నారు. విమానాల విడిభాగాల ప్రాజెక్టులు తెస్తామన్నారు. పెద్దపెద్ద పరిశ్రమలు వస్తే ఉపాధి వస్తుందనే మాటలుమాటలుగానే మిగిలాయి. కనిగిరి సెజ్‌ను కేంద్రమే యుపిఏ హయాంలో ప్రకటించింది. తర్వాత దీని ఊసేలేదు.

– మాండస్ తుపానుకు దెబ్బతిన్న పొగాకు రైతులను కేంద్రం పట్టించుకోలేదు. జిల్లాలో పంట పూర్తిగా పోయింది. కనీసం ఎన్ని ఎకరాల్లో దెబ్బతిన్నదనే సమాచారం కూడా పొగాకు బోర్డు సేకరించలేదు. తిరిగి ఇప్పుడు మళ్లీ తోటలు వేసుకుంటున్నారు. రైతులను పూర్తిగా కేంద్రం వదిలేసింది. పొగాకు ఉత్పత్తుల నుంచి రూ.30 వేల కోట్లకు పైగా పన్నుల రూపంలో కేంద్రానికి వస్తోంది. దాన్ని పండించే రైతులకు మాత్రం ఏ భరోసా ఇవ్వడం లేదు.

**పార్లమెంటులో మాగుంట ప్రస్తావించిన అంశాలు..**

ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి పార్లమెంటు సమావేశాల నేపథ్యంలో సభలో కొన్ని అంశాలను ప్రస్తావించారు. కొన్ని సమస్యలపై ప్రశ్నల రూపంలో ఆయన కేంద్రాన్ని వివరణలు కోరారు. వాటిల్లో ప్రధానంగా జిల్లాలో 5జీ సేవల విస్తరణ, మాండూస్ తుఫానుకు దెబ్బతిన్న రైతులను ఆదుకోవడం, గ్రామీణ ప్రాంతాల్లో కుళాయిల ఏర్పాటుకు తీసుకునే చర్యలు ఏమిటి? రైతులకు సోలార్ పంపుసెట్లు ఏర్పాటుకు తీసుకునే చర్యలు, కేంద్ర విద్యాసంస్థల అభివృద్ధికి తీసుకునే చర్యలు, తీర ప్రాంతాల్లో మత్స్యకారుల అభివృద్ధి కోసం మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలపై ఆయన కేంద్రాన్ని ప్రశ్నించారు. ఆయనకు ఆయా అంశాలకు సంబంధించి అడిగిన ప్రశ్నలకు రాతపూర్వకంగానే సమాధానాలు ఇచ్చారు.

## కోల్డ్‌స్టోరేజిలో సరుకు మాయం

**(మొదటిపేజీ తరువాయి)**

రుణం తీసుకున్నానన్నారు. అప్పట్లో శనగలకు మంచి మార్కెట్ లేకపోవటం వల్ల సరుకులు అమ్మలేకపోయానని, బ్యాంకు వారు రుణం చెల్లించాలని ఒత్తిడి చేయడంతో కొంతభాగం తాను చెల్లించానని చెప్పారు. సిండికేట్ బ్యాంకు కెనరా బ్యాంకులో కలిసిపోవడంతో బ్యాంకు లాయర్ ద్వారా ఇంకా రూ.4,51,500 చెల్లించాలని, లేనిచో కోల్డ్ స్టోరేజ్ లోని సరుకును వేలం వేస్తామని నోటీసులు ఇచ్చారని చెప్పారు. దీంతో తాను భయపడి స్టోరేజ్ దగ్గరకు వెళ్లి సరుకు అమ్ముతానని, తన సరుకు చూపాలని ప్రస్తుతం స్టోరేజ్ బాధ్యతలు చూస్తున్న వడ్డవల్లి రామాంజనేయులును అడిగానని, అయితే అతను బ్రోకర్లను తెచ్చుకోవాలని కొన్నిసార్లు, ముఠా వాళ్లు లేరని కొన్నిసార్లు.. సరుకు చూపించకుండా కాలయాపన చేస్తున్నాడని ఆరోపించారు. సరుకు చూపాలని గత మార్చి నెల నుండి తిరుగుతున్నా తన మొర ఆలకించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. బ్యాంక్ మేనేజర్ స్టోరేజ్ స్టాఫ్‌ను తీసుకొని లోపలికి వెళ్లి చూడగా, అందులో తన సరుకు లేదని తేలిందన్నారు. సరుకును యజమాని రామాంజనేయులు అమ్ముకున్నాడని స్టోరేజ్ సిబ్బంది చెప్పారని, తనవే కాకుండా మరికొందరి సరుకును కూడా రైతులకు తెలియకుండా అమ్ముకున్నట్లు తెలుస్తోందని శ్రీరామమూర్తి చేపారు. ఈ విషయమై రామాంజనేయులును ప్రశ్నిస్తే.. అవసరం వచ్చి తాను సరుకును అమ్ముకున్నానని, త్వరలోనే డబ్బులు చెల్లిస్తామని బ్యాంకు మేనేజర్‌కు చెప్పాడని ఆయన తెలిపాడు. కోల్డ్‌స్టోరేజ్ యాజమాన్యంపై తగు చర్యలు తీసుకొని, తనకు న్యాయం చేయాలని శ్రీరామ్‌మూర్తి ఎస్ఐ తిరుపతిరావుకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.

## డిప్యూటీ డీఈవో వెంకటేశ్వర్లు మృతి

ప్రజాశక్తి-కొండపి



పి వెంకటేశ్వర్లు (ఫైల్)

ప్రస్తుతం కందుకూరు డిప్యూటీ డీఈవోగా బాధ్యతలు నిర్వహిస్తున్న పి వెంకటేశ్వర్లు సోమవారం రాత్రి 11 గంటల సమయంలో గుండె పోటుతో మరణించారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. కొండపి మండలంలో సీనియర్ ఉపాధ్యాయులుగా, ఎంఈవోగా, ప్రధానోపాధ్యాయులుగా సుదీర్ఘకాలం పనిచేశారన్నారు. ప్రస్తుతం కందుకూరు డిప్యూటీ డీఈవోగా బాధ్యతలు నిర్వహిస్తున్నారన్నారు. సోమవారం రాత్రి కొండపిలో ఆయన నివసిస్తున్న గృహంలో ఒక్కసారిగా గుండెపోటు రావడంతో వెంటనే ఒంగోలు ఆసుపత్రికి తీసుకొని వెళ్లగా అప్పటికే ప్రాణాలు విడిచినట్లు తెలిపారు. ఆయన పార్థివ దేహాన్ని తన స్వస్థలం గుంటూరు జిల్లా ఆరేపల్లికి మంగళవారం ఉదయం 3 గంటలకు కుటుంబ సభ్యులు తీసుకువెళ్లారు. గత 15 సంవత్సరాల నుంచి వెంకటేశ్వర్లు ప్రజాశక్తి పేపరు తీసుకుంటూ ప్రజాశక్తి అభిమానిగా ఉన్నారు.

# నిందితులపై చర్యలు తీసుకోండి

### 2016 ఆర్‌పిడి వికలాంగుల హక్కుల చట్టాన్ని అమలు చేయాలని ఎస్‌పి మల్లికగర్గ్‌కు ఏడీ అర్చన వినతి

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి-వేటపాలెం

ఉమ్మడి ప్రకాశం జిల్లాలో వికలాంగులపై దురాగతాలకు పాల్పడుతున్న నిందితులపై 2016 వికలాంగుల చట్టాన్ని అమలుపరిచే విధంగా అన్ని పోలీస్ స్టేషన్లకు ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ దివ్యాంగుల సంక్షేమ శాఖ ఏడి గురజాల అర్చన మంగళవారం ప్రకాశం జిల్లా ఎస్‌పి మల్లిక గర్గ్‌కు వినతిపత్రం అందజేశారు. మంగళవారం ప్రజాశక్తిలో ప్రచురితమైన 'అయ్యో.. వికలాంగులు' కథనంపై ఆమె స్పందించారు. ఈ మేరకు ఎస్‌పికి వినతిపత్రం అందజేశారు. మానసిక వికలాంగులపై జిల్లాలో వరుస సంఘటనలు జరిగినా నిందితులను కట్టడి చేయడం లేదని ఏడి పేర్కొన్నారు. మరీ ముఖ్యంగా బుద్ధి మాంద్యం గల స్త్రీలు, పిల్లలపై అత్యాచారాలకు పాల్పడిన వారికి స్టేషన్ బెయిల్స్ ఇవ్వడం వలన వికలాంగుల భద్రతపై తప్పుడు సంకేతాలు వెళుతున్నాయని పేర్కొన్నారు. 2016 వికలాంగుల చట్టంలోని సెక్షన్ 92 ప్రకారం ఎవరైనా వైకల్యం ఉన్న వ్యక్తిపై దాడి చేసినా, బలవంతం చేసినా ఆరు నెలలకు తక్కువ కాకుండా జైలు శిక్ష, జరిమానాతో పాటు మరో ఐదు సంవత్సరాలు శిక్ష పొడిగించే విధంగా చర్యలు చేపట్టాలని ఆమె విన్నవించారు.



ప్రకాశం జిల్లా ఎస్‌పి మల్లికగర్గ్‌కు వినతిపత్రం అందజేస్తున్న ప్రకాశం, బాపట్ల జిల్లాల దివ్యాంగుల సంక్షేమ శాఖ ఏడి గురజాల అర్చన

**నిందితులను శిక్షించాలి: షేక్ కాలేషా, రాష్ట్ర అధ్యక్షులు నవ్యాంధ్ర వికలాంగుల హక్కుల సేవా సమితి**

జిల్లాలో వికలాంగులపై జరిగిన దురాగతాలపై రాష్ట్ర, జిల్లా అధికారులు సమగ్ర విచారణ జరిపి నిందితులకు కఠిన శిక్షలు విధించాలి. వికలాంగుల సమస్యల పట్ల స్పందించిన సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ గురుజాల అర్చనకు మా సంఘం తరపున ధన్యవాదాలు తెలుపుకొంటున్నాము.

## అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

ప్రజాశక్తి-రేపల్లె

రేపల్లె మండలం, భట్టిప్రోలు మండలం, రేపల్లె మున్సిపాలిటీలలో అంగన్‌వాడీ కార్యకర్త పోస్టులు భర్తీ చేసేందుకు అర్హులైన మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతూ నోటిఫికేషన్ విడుదల చేశారు. ఐసిడిఎస్ ప్రాజెక్ట్, రేపల్లె పరిధిలోని రేపల్లె మున్సిపాలిటీ, రేపల్లె మండలం, భట్టిప్రోలు మండలంలోని అంగన్‌వాడీ కార్యకర్త 5పోస్టులు భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ జారీ చేసినట్లు తెలిపారు. దరఖాస్తులను ఐసిడిఎస్ ప్రాజెక్ట్, రేపల్లెలో ఈ నెల 10న సాయంత్రం 5 గంటల లోపు అందించాలని ప్రాజెక్ట్ ఇన్‌ఛార్జి అధికారి డి మాణిక్యం తెలిపారు.

**పంగులూరు:** ఐసిడిఎస్ అద్దంకి ప్రాజెక్ట్ పరిధిలోని అద్దంకి, కొరిశపాడు, పంగులూరు మండలాలలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాల పోస్టులకు నోటిఫికేషన్ జారీ చేసినట్లు సిడిపిఓ కృష్ణవేణి మంగళవారం తెలిపారు. అద్దంకి మండలంలోని కార్యకర్తల పోస్టులు-5, ఆయా పోస్టులు-17, కొరిశపాడు మండలంలో కార్యకర్తల పోస్టులు-2 ఆయా పోస్టులు-5, పంగులూరు మండలంలో కార్యకర్తల పోస్ట్-1, ఆయా పోస్టులు-11 ఖాళీగా ఉన్నట్లు తెలియజేశారు. ఈ ఖాళీలకు సంబంధించి నోటిఫికేషన్ జారీ చేసినట్లు తెలిపారు. అంగన్‌వాడీ కార్యకర్తలకు 10వ తరగతి అర్హత కలిగి ఉండాలని, ఆయా పోస్టులకు 7వ తరగతి అర్హత కలిగి ఉండాలని పేర్కొన్నారు. ఫిబ్రవరి 10వ తేదీ లోపు పూర్తి చేసిన దరఖాస్తులను కొరిశపాడు కార్యాలయంలో అందజేయాలని కోరారు.

## చీరాలలో కార్డెన్ సెర్చ్

### 300 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం ● 4లీటర్ల నాటుసారా స్వాధీనం

ప్రజాశక్తి-చీరాల



నాటుసారాను స్వాధీనం చేసుకున్న పోలీసులు

జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు చీరాల డిఎస్‌పి శ్రీకాంత్ పర్యవేక్షణలో సెబ్ సీఐ సోమయ్య, వన్ టౌన్, టూ టౌన్ రూరల్, సిఐలు మల్లికార్జునరావు, సోమశేఖర్ మల్లి కార్జునరావు చీరాల రూరల్ ప్రాంతంలో కార్డెన్ సర్చ్ నిర్వహించారు. ఈ సెర్చ్‌లో భాగంగా ఆదినారాయణపురం, రాంనగర్, న్యూ కాలనీ, పలు ప్రాంతాలలో సిబ్బందితో సోదాలు నిర్వహించి నాటు సారా తయారీ సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడులలో 300 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసి 4లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నారు. అదే విధంగా పలు ద్విచక్ర వాహనాల ధ్రువీకరణ పత్రాలను పరిశీలించారు. నాటు సారా తయారీకి పాల్పడుతున్నట్లు ఎవరైనా గుర్తించినట్లయితే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని స్థానికులకు సూచించారు. గుర్తు తెలియని వ్యక్తులు, అపరిచితులు అనుమానాస్పదంగా కనిపించిన వారిపై నిఘా ఉంచి తమకు సమాచారం అందించాలని కోరారు. కార్డెన్ సర్చ్ కార్యక్రమంలో ఎస్‌ఐలు సురేష్, నాగరాజు, జనార్దన్, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

## రెండు బైకులు ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-వెలిగండ్ల



ప్రమాదంలో గాయపడిన నాగయ్య

మండలంలోని హుస్సేన్‌పురం గ్రామ పంచాయతీ పరిధిలోని పద్మాపురం క్రాస్ రోడ్డు వద్ద మంగళవారం ఎదురెదురుగా వస్తున్న రెండు బైకులు ఢీకొన్న సంఘటనలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్ఐ పి మహేష్‌కుమార్ కథనం మేరకు.. కనిగిరి మండలం గొల్లపల్లి గ్రామానికి చెందిన జవ్వాజి చిన్ననాగయ్య మొగుళ్ళూరు నుంచి ద్విచక్ర వాహనంపై స్వగ్రామమైన గొల్లపల్లికి వెళ్తున్నారు. అదే సమయంలో కనిగిరి నుంచి పమ్మినేనిపల్లి గ్రామానికి చెందిన కర్నాటి వెంకటరెడ్డి(వరయ్య) ద్విచక్ర వాహనంపై వస్తుండగా రెండు వాహనాలు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో నాగయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడ్ని పోలీసు వాహనంలో కనిగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

## నేడు రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-ఇంకొల్లు రూరల్

ఇంకొల్లు నుంచి పర్చూరు వరకు 19 కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మాణానికి బుధవారం ఉదయం 10 గంటలకు శంకుస్థాపన జరగనుంది. ఒంగోలు రోడ్డులోని బొమ్మల సెంటర్ వద్ద రూ.24 కోట్ల వ్యయంతో రోడ్డు నిర్మాణం జరగనుంది. శంకుస్థాపనకు వైసిపి పర్చూరు నియోజకవర్గ సమన్వయకర్త ఆమంచి కృష్ణమోహన్ ముఖ్య అతిథిగా హాజరు కానున్నారు. సినిమాహాలు సెంటర్ కూడలి నుంచి పర్చూరు రోడ్డులోని వై జంక్షన్ వరకు 10 మీటర్ల మేర సిమెంటు రోడ్డు, తదుపరి 7 మీటర్ల మేర తారు రోడ్డు నిర్మాణం జరగనుంది. ఈ రోడ్డు నిర్మాణం జరిగితే ఎన్నో సంవత్సరాలుగా ఇబ్బంది పడుతున్న ప్రజలకు ఊరట లభిస్తుంది.

## ఎఎస్ఐ కుమారునికి కారుణ్య నియామకం

ప్రజాశక్తి-ఒంగోలు క్రైం

విధినిర్వహణలో ఎఎస్ఐ మరణించగా ఆయన కుమారుడికి జిల్లా ఎస్‌పి మల్లికగర్గ్ కారుణ్య నియామక పత్రం మంగళవారం అందచేశారు. ఎఎస్ఐ ఎం చంద్రశేఖరరాజు కొనకనమిట్ల పిఎస్‌లో విధులు నిర్వహించేవారు. అయితే ఆయన గత ఏడాది ఆగస్టు 6వ తేదీన అనారోగ్య కారణంతో మృతి చెందారు. దీంతో ఆయన కుమారునికి డిపిఓ కార్యాలయంలో టైపిస్ట్‌గా ఉద్యోగం కల్పిస్తూ నియామకపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో డిపిఓ ఎఓ సులోచన పాల్గొన్నారు.

## లోకేష్ పాదయాత్రలో 'ఐనంపూడి'

ప్రజాశక్తి-కొండపి



లోకేష్ పాదయాత్రలో టిడిపి నాయకులు ఐనంపూడి రమేష్

తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ నిర్వహిస్తున్న యువగళం పాదయాత్రలో కొండపి మండలం మిట్టపాలెం గ్రామానికి చెందిన ఐనంపూడి రమేష్ పూర్తి స్థాయిలో పాల్గొంటు న్నారు. మంగళవారం నాడు ఐనంపూడి రమేష్‌తో ప్రజాశక్తి మాట్లాడింది. సివిల్ ఇంజనీరింగ్‌లో మాస్టర్స్ చేసిన రమేష్ ప్రకాశం జిల్లా సింగరాయకొండలోని ఎమర్జెన్సీ ఫ్లైట్ ల్యాండింగ్ ప్రాజెక్టులో డిప్యూటీ ప్రాజెక్టు మేనేజర్ హోదాలో అత్యంత క్రియాశీలకంగా పనిచేశారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని పలు ప్రతిష్టాత్మక రోడ్డు ప్రాజెక్టుల నిర్మాణంలో రమేష్ పాలు పంచుకున్నారు. తొలి నుంచి టిడిపి రాజకీయాల్లో క్రియాశీలకంగా ఉన్న రమేష్ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యువగళం పాదయాత్రకు పిలుపునిచ్చిన నేపథ్యంలో తన ఉద్యోగానికి రాజీనామా చేశారు. లోకేష్‌తో కలిసి 400 రోజులు 4 వేల కిలోమీటర్ల పాదయాత్రలో పూర్తిస్థాయిలో పాల్గొనాలని నిర్ణయించుకున్నారు. ఈ మేరకు ఈ నెల 27వ తేదీన కుప్పంలో నారా లోకేష్‌తో కలిసి పాదయాత్రలో పాల్గొంటున్నారు. ఈపాటికే ఈ పాదయాత్ర కుప్పం నియోజకవర్గంలో పూర్తి చేసుకుని పలమనేరు నియోజకవర్గంలోకి ప్రవేశించిందన్నారు. కొండపి శాసనసభ్యులు డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి, యువ నాయకులు దామచర్ల సత్య ఆశీస్సులతో తాను పూర్తి స్థాయిలో ఈ పాదయాత్రలో పాల్గొంటున్నట్లు రమేష్ వెల్లడించారు. రాష్ట్రంలో టిడిపి అధికారంలోకి రావడమే లక్ష్యంగా తాను ఉద్యోగాన్ని వదిలి ఈ పాదయాత్రలో పాల్గొంటున్నట్లు ఆయన వివరించారు. టిడిపి అధికారంలోకి వస్తేనే రాష్ట్రం అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. లోకేష్ పాదయాత్రలకు ప్రజల నుంచి అనూహ్య స్పందన వస్తోందని ఆయన పేర్కొన్నారు.

## దొంగ బాబాలకు గుణపాఠం కావాలి

### హేతువాద సంఘ అధ్యక్షులు నార్నె వెంకటసుబ్బయ్య

ప్రజాశక్తి-ఒంగోలు క్రైం

దొంగబాబా ఆశారాం బాపునకు జీవిత శిక్ష మిగిలిన బాబాలకు గుణపాఠం కావాలని ఏపి హేతువాద సంఘం అధ్యక్షులు నార్నె వెంకటసుబ్బయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం ఏ బాబా ఆశ్రమం చూసినా హత్యలు, అత్యాచారాలు, భూ కుంభకోణాలు, మాదక ద్రవ్యాల అమ్మకాలు, చెక్ బౌన్స్ కేసులు అన్నట్లుగా తయారయ్యాయన్నారు. ఆధ్యాత్మిక కేంద్రాల పేరుతో ఆశ్రమాలన్నీ నేడు నేర సామ్రాజ్యాలుగా మారుతున్నాయని పేర్కొన్నారు. దొరికినవాడు దొంగ, దొరకనివాడు దొరగా బాబాలున్నారని అన్నారు. పది సంవత్సరాల క్రితం మైనర్ బాలికపై అత్యాచారం కేసులో ఆశారామ్‌బాబా అనే బాబా ఐదు సంవత్సరాల నుంచి బెయిల్ కూడా లేకుండా జైల్లో ఉన్నాడు. ఈ రోజు కేసు రుజువు కావడంతో ఆశారాంబాపుకు కోర్టు జీవిత శిక్ష వేసింది. దీనితోనైనా మిగిలిన బాబాలకు గుణపాఠం కావాలన్నారు. నిత్యానందబాబు మైనర్ బాలిక అత్యాచారం కేసులో అరెస్టు చేస్తారని దేశం వదలి పారిపోయి వేరే దేశాన్ని కొనుక్కొని దానికి కైలాసం అని పేరుపెట్టుకున్నారని అన్నారు. అలాగే డేరాబాబా, రాంపాల్‌బాబాలు కూడా జైళ్లలో మగ్గుతున్నారని తెలిపారు. రాంపాల్‌బాబా అయితే ఆశ్రమానికి వచ్చిన మహిళా భక్తుల టాయిలెట్లలో సిసి కెమెరాలు అమర్చి, వాటిని తన బెడ్‌రూమ్ లోని టివికి అమర్చుకుని చూసి ఆనందించేవాడని బయటపడింది. ఏ బాబా అందుకు భిన్నం కాదని అన్నారు. కల్కి బాబా ఆశ్రమంలో జరిగిన వికృత చేష్టలు ఆ మధ్య టీవీలో చూశామన్నారు. ప్రస్తుతం నెల్లూరు జిల్లా గుడ్లూరు మండలం చేవూరు దొంగస్వామి కూడా ప్రభుత్వ భూములను ఆక్రమించి ఆశ్రమం పేరుతో రకరకాలుగా మోసం చేస్తున్నాడని అన్నారు. వీరందరినీ డ్రగ్‌మ్యాజిక్ రెమిడీ 1954 కింద అరెస్టు చేయడానికి కావాలసిన అర్హతలన్నీ ఉన్నాయన్నారు. కానీ ఐఎఎస్, ఐపిఎస్, మంత్రులూ ఈ బాబాలను అరెస్టు చేయకుండా భుజాలకు ఎత్తుకుని వారి గేట్ల వద్ద కాపలా కాస్తున్నారని విమర్శించారు. ఇప్పటికైనా ఆశారాంబాపు అరెస్టును గుణపాఠంగా తీసుకుని భూములను ఆక్రమించిన బాబాలను అరెస్టు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. దీంతో బాబాల నుంచి ప్రజలను రక్షించిన వారవుతారని అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.



బట్టలు పంపిణీ చేస్తున్న దృశ్యం

## వృద్ధులకు బట్టలు పంపిణీ

ప్రజాశక్తి-శింగరాయకొండ

శింగరాయకొండ మండలం పాకల గ్రామ పంచాయతీలోని హెల్ప్ టు హెల్ప్ లెస్ సొసైటీ ఆధ్వర్యంలో మంగళవారం వృద్ధులకు బట్టల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ప్రపంచ పిల్లల దినోత్సవం సందర్భంగా సొసైటీ అధ్యక్షుడు రేనుమల బ్రహ్మయ్య ఆధ్వర్యంలో డాక్టర్ బి బ్రహ్మయ్య ముఖ్యఅతిథిగా హాజరయ్యి 150 మంది వృద్ధులకు బట్టల పంపిణీ నిర్వహించారు. అనంతరం వారందరికీ భోజనం సదుపాయం కల్పించారు.

# పనులు పూర్తయినా నిధుల విడుదలేదీ?

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

రాష్ట్ర ప్రభుత్వం గడప గడపకూ ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా సచివాలయాల పరిధిలో అభివృద్ధి పనుల కోసం రూ.20 లక్షల చొప్పున నిధులు మంజూరు చేస్తున్నట్లు చెప్పిన విషయం తెలిసిందే. ఈ కార్యక్రమం ద్వారా చేపట్టే పనుల బిల్లులు ఏమాత్రం జాప్యం లేకుండా మంజూరు చేస్తామని సాక్షాత్తూ సిఎం జగన్ రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జుల సమావేశంలో హామీ ఇచ్చారు. సిఎఫ్‌ఎమ్ఎస్‌తో సంబంధం లేకుండా పాత పద్ధతిలో బిల్లుల చెల్లింపులు జరుపుతామన్నారు. అయితే ఈ నిధులు పొందేందుకు ఎమ్మెల్యేలు, ఇన్‌ఛార్జులు తమ నియోజకవర్గాల్లో గడప గడపకూ తిరగాల్సి ఉంటుందని చెప్పారు. అలా సచివాలయాల పరిధిలో ఉన్న మొత్తం ఇళ్ల సందర్శన పూర్తయ్యాక అక్కడ అభివృద్ధి పనులు చేపట్టేలా, అనుమతులు వచ్చేలా ప్రభుత్వం సాంకేతిక పరిజ్ఞానం జోడించింది. దీంతో ఎమ్మెల్యేలు, ఇన్‌ఛార్జులు చెమటోడ్చి గడప గడపకూ తిరుగుతున్నారు. ఈ నిధులతో చేపట్టే రూ.5 లక్షల లోపు పనులను టెండర్లు వేయడం కాకుండా నామినేషన్ పద్ధతిలో చేపట్టే అవకాశం ఉండడంతో స్థానిక నేతలు, తమ అనుచరుల ద్వారా పనులు చేపట్టారు. పనులు అయితే పూర్తయ్యాయి కాని బిల్లులు మాత్రం ఎప్పుడు విడుదల అవుతాయో అర్థం కాని స్థితి నెలకొంది. దీంతో ఎమ్మెల్యేలు, ఇన్‌ఛార్జుల మాటలు నమ్మి లక్షల రూపాయలు అప్పులు తెచ్చి పనులు చేపట్టిన చోటా మోటా వైసిపి నేతలు దిక్కు తోచని పరిస్థితిలో ఉండి తమ ప్రభుత్వాన్నే తిట్టుకుంటున్న దుస్థితిలో వారున్నారు. రెండేళ్ల క్రితం నియోజకవర్గాల్లో సచివాలయ భవనాలు, రైతు భరోసా కేంద్రాలు, ఆరోగ్య కేంద్ర భవనాలను రాష్ట ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ పనులన్నీ దాదాపుగా వైసిపి నేతలు, ప్రజా ప్రతినిధులు





చీరాల పట్టణంలో గడప గడపకూ నిధులతో పూర్తి అయిన సిమెంట్ రోడ్లు

అప్పట్లో చేపట్టారు. ఒక్కొక్క భవన నిర్మాణం కోసం నేతలు రూ.10 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు ఖర్చు చేశారు. కానీ నేటికీ సగం బిల్లులు కూడా మంజూరు కాలేదు. దీంతో ఆ భవనాలన్నీ అసంపూర్తిగానే ఉండిపోయాయి. ఇలాంటి నేపథ్యంలో గడప గడపకూ కార్యక్రమంలో భాగంగా అభివృద్ధి పనులను చేపట్టేందుకు ఎవరూ ముందుకు రాలేదు. బిల్లుల మంజూరులో జాప్యం ఉండదని చెప్పడంతో అభివృద్ధి పనులు చేపట్టారు. ఇప్పుడు కూడా అదే సమస్య పునరావృతం అయ్యింది. మే నెలలో ఈ కార్యక్రమాన్ని సచివాలయాల కేంద్రంగా ప్రారంభించారు. ఎమ్మెల్యేలు, ఇన్‌ఛార్జుల గృహాల సందర్శన తరువాత పనుల ప్రారంభానికి శ్రీకారం చుట్టారు. రూ.5 లక్షల లోపు పనులను నామినేషన్ పద్ధతిలో చేపట్టారు. రూ.5 లక్షలు దాటిన పనులకు టెండర్లు పిలిచారు. 8 నెలల క్రితం ఈ కార్యక్రమం మొదలు కాగా, 5 నెలల నుంచి పనులు చేపట్టారు. జిల్లాలో కోట్ల రూపాయల విలువైన పనులు పూర్తి చేశారు.

ప్రధానంగా జిల్లాలోని పురపాలక సంఘాల పరిధిలో పనులు చేపట్టేందుకు అన్‌లైన్ అనుమతులు వచ్చాయి కాని చేసిన పనులు అప్‌లోడ్ చేసే విధానం గురించి ఎలాంటి సమాచారం లేదు. పూర్తి అయిన పనుల బిల్లులను ఎలా, ఎక్కడ అప్‌లోడ్ చేయాల్లో ప్రభుత్వం నుంచి నేటికీ స్పష్టత రాలేదు. ప్రారంభంలో నేరుగా ట్రెజరీ చెల్లింపులు అన్నారు కాని ఇప్పుడు సిఎఫ్ఎంఎస్ ద్వారానే మంజూరు అని చెబుతున్నారు. ఈ కారణంగా ఒక్క చీరాల పురపాలక సంఘంలోనే రూ.40 లక్షల విలువైన పనులు పూర్తయినా నేటికీ బిల్లులు అప్‌లోడ్ కాలేదు. జిల్లాలోని అన్ని పురపాలక సంఘాలది ఇదే సమస్యగా ఉంది. ముందు పూర్తయిన పనుల తాలూకు బిల్లులు విడుదల కానందున సచివాలయాల్లో చేపట్టిన పలు పనులు అరకొరగానే జరుగుతున్నాయి. జిల్లాలో ఆరు నియోజకవర్గాల పరిధిలో ఉన్న 25 మండలాలు, నాలుగు పురపాలక సంఘాల పరిధిలో పంచాయితీరాజ్, విద్యుత్, ఆర్‌డబ్ల్యూఎస్, పురపాలక శాఖల ద్వారా రూ.34.78 కోట్ల విలువైన 788 పనులు ప్రతిపాదించారు. 770 పనులు మంజూరు చేశారు. ఇందులో రూ.28 కోట్ల విలువైన 682 పనులు ప్రారంభించారు. అప్‌లోడ్ చేయడంలో పలు రకాల సాంకేతిక సమస్యల కారణంగా బిల్లులు ఎప్పుడు వస్తాయో అర్థం కాక పనులు చేపట్టిన నేతలు అయోమయంలో ఉన్నారు.



దుప్పట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

## వృద్ధులకు దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి-రేపల్లె

పట్టణంలోని పద్మావతి సెంటర్ ఆంజనేయస్వామి దేవాలయం వద్ద వృద్ధులకు చలి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని వృద్ధులకు వికలాంగులకు, దుప్పట్లను పట్టణ ఆదర్శ వేదిక ఆధ్వర్యంలో మంగళవారం పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ కట్టా మంగా మాట్లాడుతూ చలికాలంలో వృద్ధులు తీవ్ర ఇబ్బందులకు గురవుతారనే ఉద్దేశంతో దుప్పట్లను, పండ్లను అందిస్తున్న పట్టణ ఆదర్శ వేదిక సేవలు అభినందనీయమని అన్నారు. వృద్ధులకు ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరించడానికి కృషి చేస్తానని అన్నారు. ప్రతి ఒక్కరూ వృద్ధుల పట్ల మానవత్వ విలువలతో వ్యవహరించాలని కోరారు. పట్టణ ఆదర్శ వేదిక కార్యదర్శి యడ్లపల్లి కిషోర్ మాట్లాడుతూ ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడానికి సహకరిస్తున్న దాతలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కట్టా సుబ్బారావు, సాయి కృష్ణమాచార్యులు, మత్యుంజయరావు, అయోధ్య బోస్, వృద్ధులు పాల్గొన్నారు.



స్కాలర్‌షిప్‌నకు ఎంపికైన విద్యార్థులతో పాఠశాల సిబ్బంది

## బూదవాడ విద్యార్థులకు స్కాలర్‌షిప్

ప్రజాశక్తి-పంగులూరు

పోస్టల్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో గత సంవత్సరం అక్టోబర్లో నిర్వహించిన దీన్ దయాళ్ స్పర్శ యోజన స్కాలర్‌షిప్‌నకు బూదవాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు ఎంపికైనట్టు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఐ అనిత ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన విద్యార్థులు ఇద్దరు ఎనిమిదో తరగతి, ఒకరు 9వ తరగతి చదువుతున్నారని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 24 మంది విద్యార్థులు ఎంపిక కాగా వారిలో ముగ్గురు బి దివ్య, ఎం సిరివల్లి, ఎస్కే గౌస్ బాషా బూదవాడ పాఠశాల విద్యార్థులు కావటం గమనార్హమని అన్నారు. వీరికి త్వరలో విజయవాడలో జరిగే కార్యక్రమంలో కేంద్రమంత్రి చేతుల మీదుగా ఒక్కొక్కరికి రూ.6,000 నగదు బహుమతిని ప్రదానం చేస్తారని తెలిపారు. ఈ ముగ్గురు విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామపెద్దలు అభినందించారు.



విద్యార్థి మణికంఠను అభినందిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ రవికుమార్

## రాష్ట్ర స్థాయిలో సీఈసీ విద్యార్థి ప్రతిభ

ప్రజాశక్తి-చీరాల

కొత్త విషయాలను నేర్చుకునేటప్పుడు కొంత కష్టంగా ఉన్నప్పటికీ వాటిని ఇష్టంగా తీసుకొని చదివితే మంచి ఫలితాలు వస్తాయని చీరాల ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి రవికుమార్ పేర్కొన్నారు. చీరాల ఇంజనీరింగ్ కళాశాల డిప్లొమా సెకండ్ ఇయర్ సిఎంఇ విద్యార్థి పాలపు మణికంఠ మూడో సెమ్‌లో 93 శాతం మార్కులతో రాష్ట్రస్థాయిలో ప్రతిభ చూపాడు. ఈ సందర్భంగా మంగళవారం కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రవికుమార్ మాట్లాడుతూ విద్యార్థులు మంచి లక్ష్యాలను ఏర్పరచుకొని కష్టపడి ఉన్నత శిఖరాలను చేరుకోవాలని ఆకాంక్షించారు. విద్యార్థులు మణికంఠను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిఎస్ఇ హెచ్ఓడిలు సౌజన్య, మణికంఠ, అధ్యాపకులు మహాలక్ష్మి, రాజ్యలక్ష్మి ఏవో ఫణి పాల్గొన్నారు.

# విద్యార్థి జీవితంలో క్రీడలది ప్రముఖ పాత్ర: ఎస్‌పి

ప్రజాశక్తి-చెరుకుపల్లి

విద్యార్థి జీవితంలో క్రీడలు ప్రముఖమైన పాత్రను పోషిస్తాయని బాపట్ల జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ అన్నారు. చెరుకుపల్లి మండల పరిధిలోని పొన్నపల్లి గ్రామంలోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్లో నిర్వహించిన యాన్యువల్ స్పోర్ట్స్ మీట్ ను ఎస్పీ ప్రారంభించారు. చిన్న వయసు నుంచి క్రీడలు ఆడడం ద్వారా విద్యార్థులలో శారీరక దృఢత్వంతో పాటు విద్యార్థుల ఆలోచన శైలి మానసిక దృఢత్వం కలుగుతాయని అన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన క్రీడాజ్యోతిని ఎస్‌పి వెలిగించి క్రీడలను ప్రారంభించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ పైన ఏడుకొండలరెడ్డి, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.





స్పోర్ట్ మీట్‌లో పాల్గొన్న విద్యార్థులు, హాజరయిన ఎస్‌పి వకుల్ జిందాల్

# ఉగాది నాటికి జగనన్న కాలనీలు పూర్తి: కలెక్టర్

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

ఉగాది పండుగ నాటికి జగనన్న కాలనీలు ప్రారంభించడానికి అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కె విజయకృష్ణన్ చెప్పారు. గృహ నిర్మాణాలపై సంబంధిత అధికారులతో మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్లో సమావేశం నిర్వహించారు. ఉగాది పండుగ నాటికి ప్రతి నియోజకవర్గంలో ఒక కాలనీలోని గృహ నిర్మాణాలన్నీ పూర్తిచేసి ప్రారంభించేలా చూడాలని కలెక్టర్ తెలిపారు. తెలుగు ప్రజల్లో ఉగాది పండుగ సంతోషాన్ని నింపే మాదిరిగానే సొంత ఇంటి కలలను పేదలు నెరవేర్చుకునేలా చేయాలన్నారు. అధికారులే లక్ష్యాలను నిర్దేశించుకుని పనిచేయాలన్నారు. సుమారుగా 2,600 గృహాలు ప్రారంభానికి చక్కటి ప్రణాళిక రూపొందించుకోవాలని ఆదేశించారు. గృహ నిర్మాణాలకు అవసరమైన రుణ సదుపాయాన్ని బ్యాంకుల ద్వారా కల్పించడానికి డిఆర్‌డిఏ అధికారులు, సిబ్బంది సహకరించాలన్నారు. సుమారుగా 1,516 మంది లబ్ధిదారులకు రుణాలు ఇప్పించేలా ఏర్పాట్లు చేయాలన్నారు. రేపల్లె నియోజకవర్గంలో 2,290 మందికి రుణాలు ఇప్పించాల్సి ఉండగా ఇప్పటివరకు వంద మందికి



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయకృష్ణన్

కూడా రుణం ఇవ్వకపోవడంతో సంబంధిత అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వేమూరు నియోజకవర్గంలోనూ మూడు వారాలుగా లబ్ధిదారులకు రుణాలు ఇప్పించలేకపోవడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. అద్దంకి, బాపట్ల నియోజకవర్గాలలో గృహ నిర్మాణాలు ముమ్మరంగా సాగేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. లబ్ధిదారులకు అవగాహన కల్పిస్తూనే వారిని చైతన్య పరచాలన్నారు. క్షేత్రస్థాయిలో అధికారులు పనిచేయకపోతే పురోగతి ఎలా ఉంటుందని నిలదీశారు. గృహాలు నిర్మించుకునే వారికి రుణాలు ఇప్పించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ప్రభుత్వ ప్రాధాన్యత భవన నిర్మాణాలలో పురోగతి కనిపించాలని విజయకృష్ణన్ చెప్పారు. పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులు చేపడుతున్న ప్రభుత్వ భవన నిర్మాణాలపై కలెక్టర్ సమీక్షించారు. పర్చూరు నియోజకవర్గంలో ఆరు భవనాలు ప్రారంభం కాకపోవడంతో ఆరా తీశారు. వేమూరు నియోజకవర్గంలో 12 భవనాలు పెండింగ్‌లో ఉన్నాయని, నాలుగు భవణాలు మరో దశకు చేరేలా నిర్మాణాలు చేపట్టాలన్నారు. బాపట్ల నియోజకవర్గంలో 20 భవనాలు మొదలు కాకపోవడంపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. చినగంజాంలో 8, ఇంకొల్లులో రెండు భవనాలు నిర్మాణం జరగకపోవడం ఏమిటని ఇంజినీరింగ్ అధికారులను నిలదీశారు. గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవనాలను ప్రభుత్వం ప్రాధాన్యతగా భావిస్తున్నందున శరవేగంగా నిర్మాణాలు జరిగేలా చూడాలన్నారు. మీ విధులు బాధ్యతగా నిర్వహిస్తూ పురోగతి కనిపించేలా పని చేయాలని ఆమె సూచనలు చేశారు. ఈ సమావేశంలో గృహ నిర్మాణ శాఖ పీడి ప్రసాద్, ఆర్డిఏ పీడి అర్జున్ రావు, డివిజన్ ఇంజనీర్లు, డిపిఎంలు, ఏరియా కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న డీఎస్పీ

## శాంతిభద్రతలను సమర్థవంతంగా నిర్వహించాలి

### ఎస్ఐకి డీఎస్పీ సూచన

**ప్రజాశక్తి-టంగుటూరు**

టంగుటూరు ప్రాంతంలో శాంతిభద్రతలను ఇంకా సమర్థవంతంగా నిర్వహించడంతోపాటు ప్రజల నుండి ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలని ఒంగోలు ఎస్ పి యు నాగరాజు టంగుటూరి షేక్ ఖాదర్ భాషా కు సూచించారు పోలీస్ స్టేషన్ల సాధారణ సందర్శనలలో భాగంగా డి.ఎస్.పి టంగుటూరు పోలీస్ స్టేషన్ను మంగళవారం సందర్శించారు స్టేషన్ లో పెండింగ్ కేసులు ప్రస్తుత కేసుల పూర్వకతి చోరీ కేసుల రికవరీలు టంగుటూరులో ట్రాఫికింగ్, విజిబుల్ పోలీసింగ్ తన వివరాలను రికార్డుల ద్వారా పరిశీలించిన డీఎస్ ఖాదర్ భాషా కు పలు సూచనలు చేశారు. సమయాలలో గస్తీలను మరింతగా పెంచి విధినిర్వహణలో ప్రజల నుండి మరిన్ని మరణం అందుకోవాలని డిఎస్పీ నాగరాజు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ ఎన్ శ్రీధర్, సిబ్బంది షేక్ చాంద్ బాషా, పి ఏడుకొండలు, డి.రవికుమార్ తదితరులు ఉన్నారు.

## మూగజీవాలను హింసించటం తగదు

**ప్రజాశక్తి-కనిగిరి**

క్షణికానందం కోసం మూగజీవాలను హింసించటం తగదని కనిగిరి ఏరియాపశువైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ కె సత్యనారాయణ,సంచార పశువైద్య వాహన వైద్యులు ఎస్కె చాంద్బాషాలు తెలియజేశారు. పశుసంరక్షణ వారోత్సవాలను పురష్కరించుకొని కనిగిరి మోడల్ స్కూల్లో విద్యార్థులకు పెంపుడు జంతువులపట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పెంపుడు జంతువులకు సరైన ఆహారంతోపాటు సంరక్షణ సమర్ధవంతంగా అందించాలని సూచించారు. యాంటి రాబిస్ వ్యాక్సిన్ వేయించాలని సూచించారు.అవగాహన కార్యక్రమంలో ప్రతిభను చాటిన విద్యార్థులకు భహుమతులు,మిటాయిలు పంచిపెట్టారు.


మాట్లాడుతున్న ఎంపిడిఒ రంగసుబ్బరాయుడు

## మురారిపల్లిలో ప్రభుత్వ పథకాలపై అవగాహన

**ప్రజాశక్తి-యర్రగొండపాలెం**

యర్రగొండపాలెం మండలంలోని మురారిపల్లి గ్రామంలో ఎన్ఎల్ఎం జాతీయ స్థాయి పర్యవేక్షణ కమిటీ మంగళవారం పర్యటించింది. డే ఎన్ఎల్ఎం, ఉపాధి, అంగన్వాడి, పిఎంఎంఇవై, పిఎంకెఎస్వై, పిఎంఏవైజి, హౌసింగ్ హెల్త్, వైఎస్ఆర్ క్రాంతి పథం వంటి పథకాలకు సంబంధించి కొంతమంది లబ్ధిదారులను కలిశారు. అలాగే ఆయా గ్రామాలలోని పింఛన్లు వచ్చేటువంటి ఐదు మంది లబ్ధిదారులను కలిసి వారితో పింఛన్ల పంపిణీ గురించి చర్చించారు. ఆ గ్రామాలలోని హౌసింగ్ లబ్ధిదారులతో పాటు ఐదు స్వయం సహాయక సంఘాలు మహిళలతో కలిసి అన్ని ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా లేదా అని చర్చించారు. పొదుపు సంఘాలన్నీ సక్రమంగా నడుస్తున్నాయా లేదా అని వారిని ప్రశ్నించి తగు సలహాలు, సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు ఎంపీడీవో ఎం రంగసుబ్బ రాయుడు, హౌసింగ్ ఏఈ అంజిరెడ్డి, అగ్రికల్చర్ ఏవో పెద్ద వెంకటేశ్వర్లు, ఏపీవో కందుకూరి నాగేశ్వరరావు, ఏపిఎం వెంకిరెడ్డి, అంగన్వాడి సూపర్ వైజర్ హేమలత, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, వైకెపి సిబ్బంది, సిసిలు, విఓఏలు, ఆశా వర్కర్లు, అంగన్వాడీ టీచర్లు, గ్రామ ప్రజలు, పొదుపు సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# భవన నిర్మాణం వేగవంతం చేయండి

**ప్రజాశక్తి-చీమకుర్తి**

జడ్పీ చైర్పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ

నగర పంచాయతీ నూతన భవన నిర్మాణం వేగవంతం చేయాలని జిల్లా పరిషత్ చైర్పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ పేర్కొన్నారు. మంగళవారం మున్సిపల్ ఛైర్మన్ చల్లా అంకులు అధ్యక్షతన జరిగిన మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో ఆమె పాల్గొన్నారు. అనంతరం నిర్మాణంలో ఉన్న మున్సిపల్ నూతన కార్యాలయ భవన నిర్మాణపనులను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ కార్యాలయాల ఆధునీకరణకు కృషి చేస్తుందన్నారు. ప్రభుత్వ నిధులతో మున్సిపల్ నూతన కార్యాలయ భవనం వేగవంతంగా నిర్మాణ పనులు జరగడాన్ని ఆమె అభినందించారు. ఏపిఎండిసి నిధులతో మున్సిపాలిటీకి జెసిబి కావాలని కోరాననీ, వారు స్పందించి జెసిబి మున్సిపాలిటీకి ఇవ్వనున్నట్లు తెలిపారు. కౌన్సిల్ సమావేశంలో 15 అభివృద్ధి పనులకు సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు.ఈ సంధర్భంగా ఉత్తమ మున్సిపల్ కమీషనర్గా అవార్డు అందుకున్న కమీషనర్ ఎస్కె ఫజులుల్లాను బూచేపల్లి



కమిషనర్ ఫజులుల్లాను అభినందిస్తున్న బూచేపల్లి వెంకాయమ్మ

వెంకాయమ్మ ఘనంగా సత్కరించారు. అభినందించారు. కార్యక్రమంలో పట్టణ వైసిపి అధ్యక్షులు కె శేఖరరెడ్డి, వైఎస్ ఛైర్మన్ బి వెంకటరెడ్డి, మాణిక్యం, కౌన్సిలర్లు జి రాజ్యలక్ష్మి,ఎస్కె యస్దానీ, మేకల యల్లయ్య, భీమన వెంకటరావు, సోమా శేషాద్రి, పి కోటేశ్వరరావు, గంగయ్య, గొల్లపూడి రమాదేవి పాల్గొన్నారు.

# మూగజీవాలను కాపాడాలన్నదే ప్రభుత్వ లక్ష్యం

**ప్రజాశక్తి-టంగుటూరు**

పశుసంవర్ధక శాఖ జేడీ డాక్టర్ బేబీరాణి

మూగజీవాలు ప్రమాదాల బారిన పడినా, అనారోగ్యానికి గురై నడవలేకపోయినా.. అవి మరణించకుండా కాపాడాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని పశు సంవర్ధక శాఖ జిల్లా సంయుక్త సంచాలకులు డాక్టర్ కె.బేబీరాణి అన్నారు. మంగళవారం స్థానిక పశుసంవర్ధక శాఖ ఏడీ కార్యాలయంలో సంచార పశువైద్యశాల వాహనాన్ని వారు ప్రారంభించి.. మాట్లాడారు. జిల్లా పరిధిలోని ఒక్కో నియోజకవర్గానికి ఒక్కొక్క వాహనంతో పాటు అదనంగా మరొకటి కలిపి ప్రస్తుతం తొమ్మిది సంచార పశువైద్య వాహనాలను జిల్లాలో ప్రారంభించినట్లు తెలిపారు. ఈ వాహనంలో పశువులకు ప్రాథమిక వైద్యంతో పాటు అత్యవసర చికిత్సలకు సైతం నాణ్యమైన వైద్య సదుపాయాలన్నింటినీ సంచార వాహనంలో సమకూర్చినట్లు తెలిపారు. వాహనాన్ని జేడీ పచ్చజెండా ఊపి.. ప్రారంభించగా.. వైసిపి కొండపి ఇన్ఛార్జి వరికూటి అశోక్ బాబు ఇంజన్ స్టార్ట్ చేసి.. సంచార పశువైద్య వాహనాన్ని కొద్ది దూరం నడిపారు. పశు పోషకులు టోల్ ఫ్రీ నెంబర్ 1962 ద్వారా సంచార పశు వైద్య వాహన సేవలను సద్వినియోగం చేసుకోవాలని జేడీ సూచించారు. అనంతరం 2 గడ్డి కత్తిరింపు యంత్రాలను


ప్రారంభిస్తున్న జేడీ డాక్టర్ బేబీరాణి

సబ్సిడీపై లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో టంగుటూరు పశువర్ధక శాఖ సహాయ సంచాలకులు కసుకుర్తి సుధీర్ బాబు, ఒంగోలు పశువాహన అధికారి ఎం రేష్మ, పశు వైద్యాధికారులు డాక్టర్ కె అనిల్, డాక్టర్ వై ధనలక్ష్మి, డాక్టర్ జి విజయమాధవి, డాక్టర్ ఇట్లా బ్రహ్మయ్య, వైసీపీ నాయకులు చింతపల్లి హరిబాబు, ఉప్పలపాటి రామరాజు, ఉప్పలపాటి శ్రీనివాసరాజు, ఉప్పలపాటి సుబ్బరాజు, మేదరమెట్ల భరత్ రెడ్డి, మన్నం వెంకయ్య, పశువైద్యశాలల సిబ్బంది ఉన్నారు.

# కార్మిక హక్కులపై దాడిని ప్రతిఘటించండి

**ప్రజాశక్తి-హనుమంతునిపాడు**

సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జివి కొండారెడ్డి

ఉద్యోగ కార్మికుల హక్కులపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉక్కు పాదాన్ని మోపుతూ దాడి చేస్తున్నాయని ఈ దాడిని కార్మిక వర్గం ఐక్యంగా ఏకతాటిపై నిలబడి ప్రతిఘటనల ద్వారా తిప్పి కొట్టాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జివి కొండారెడ్డి పిలుపునిచ్చారు. హనుమంతునిపాడు మండల కేంద్రంలో సిఐటియు కార్యకర్తల విస్తత స్థాయి సమావేశం మండల నాయకురాలు ఊస్తేలా లక్ష్మీదేవి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న వీరు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో సెక్టార్ రంగాల్లో, ఔట్సోర్సింగ్ రంగాల్లో పని చేస్తున్నఅంగన్వాడి, ఆశా, ఫీల్డ్ అసిస్టెంట్లు, విఓఎ, వీఆర్ఏలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని కనీస వేతన చట్టం ప్రకారం రూ.26 వేలు వేతనాన్ని అమలు చేయాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని, పెన్షన్ ప్రతినెల రూ.10వేలకు తగ్గకుండా ఇవ్వాలని వీరు డిమాండ్ చేశారు. పోషకాహారం, ఆరోగ్య భద్రత, సామాజిక భద్రత లను దష్టిలో పెట్టుకున్నప్పుడు ఆరోగ్యకరమైన పౌష్టికాహారం తీసుకోవాలంటే కనీసం నెలకు రూ.26 వేలు ఖర్చు అవుతుందని, చాకిరి బారేడు రాబడి మూరెడు ఉన్నట్లుగా ప్రభుత్వాలు వెట్టిచాకిరి చేయించుకుంటూ అరకొర వేతనాలతోటి అర్ధాకుల తోటి


మాట్లాడుతున్న జివి కొండారెడ్డి

కార్మిక ఉద్యోగులను బ్రతకమని చెప్పడం ఏం న్యాయమన్నారు. కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి చింతకుంట్ల ఏసు, మండల కమిటీ సభ్యులు వెంకటేశ్వరరెడ్డి, కొటికల తిరపతయ్య, జోసఫ్ మరియు ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులైన చాముండేశ్వరి, కత్తి రూతమ్మ, ఎలిజిబెత్ రాణి, లక్ష్మీదేవి వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షులు పోతురాజు మంగయ్య, కార్యదర్శి గురునాథం, రాములు,డివైఎఫ్ఐ నాయకులు కూడలి వెంకటేశ్వర్లు, ఎస్ఎఫ్ఐ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పాపారాయుడికి సేవా స్పందన పురస్కారం

**ప్రజాశక్తి-కనిగిరి**

హైదరాబాద్లోని బ్రహ్మకుమారిస్ శాంతి సరోవరంలో స్పందన ఈదా ఇంటర్నేషనల్ ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో 3వవార్షికోత్సవం సందర్భంగా సేవా స్పందన పురస్కారాలు అందజేశారు. కనిగిరికి చెందిన కేటిసి ఎడ్యుకేషనల్ అండ్ రూరల్ డెవలప్మెంట్ సొసైటీ,మరియు కేటిసి స్టడీ సర్కిల్ చైర్మన్ కేటిసి పాపారాయుడు సేవా స్పందన పురస్కారాన్ని ఈదా ఇంటర్నేషనల్ ఫౌండేషన్ చైర్మన్ ఈదా శామ్యూల్రెడ్డి ,ప్రొఫెసర్ విశ్వనాథం ద్వారా అందుకున్నారు. పాపారాయుడును పలువురు అభినందించారు.



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ రాజారావు

## కుష్టు వ్యాధిని పూర్తిగా నిర్మూలించవచ్చు

### డిఎల్ఓ వెంకటేశ్వర్లు

**ప్రజాశక్తి-టంగుటూరు**

ప్రస్తుతం పెరిగిన వైద్య సదుపాయాల దష్ట్యా కుష్టు వ్యాధిని పూర్తిగా నిర్మూలించవచ్చని జిల్లా కుష్టు వ్యాధి నివారణ అధికారి డాక్టర్ వెంకటేశ్వర్లు, ఎంజేపీ బాలుర రెసిడెన్షియల్ పాఠశాల ప్రిన్సిపల్ కొమ్ము రాజారావు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక వెంకటాయపాలెం రోడ్డులోనిఎంజేపీ బాలుర రెసిడెన్షియల్ పాఠశాలలో కుష్టు వ్యాధి నివారణ పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పూర్వం ఈ వ్యాధి పట్ల ప్రజలలో అంటరానితనం, ఓ రకమైన ఏహ్య భావం ఉండేదన్నారు, కానీ పెరిగిన వైద్య సదుపాయాల దష్ట్యా కుష్టు వ్యాధి ప్రస్తుతం అంటరానిది కాదని, దీనిని పూర్తిగా నిర్మూలించే అవకాశం ఉందని వారు పేర్కొన్నారు. ఈ వ్యాధి పట్ల పాఠశాల విద్యార్థులలో విస్తతమైన అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టంగుటూరు ప్రాథమిక కేంద్రం వైద్యాధికారి డాక్టర్ అశోక్, పీహెచ్ సీ సిహెచ్ఓ డిఎన్ వెంకటేశులు, పాఠశాల విద్యార్థులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.


ఛైర్మన్కు సమస్యను వివరిస్తున్న వైస్ ఛైర్మన్ శాంతి

## విద్యార్థుల కష్టాలు తీర్చాలి

### మున్సిపల్ సమావేశంలో సమస్యను లేవనెత్తిన సభ్యులు

**ప్రజాశక్తి-కనిగిరి**

కనిగిరి మోడల్ స్కూల్ వెళ్లే రహదారి అధ్వానంగా ఉందని, దీంతో పాఠశాలకు వెళ్లేందుకు 700 మంది విద్యార్థులు, ఉపాధ్యాయులు నానా అవస్థలు పడుతున్నారని.. రోడ్డు వేసి.. వాళ్ల కష్టాలు తీర్చాలని మున్సిపల్ వైస్ చైర్మన్ పులిశాంతి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో జరిగిన జనరల్బాడీ సమావేశంలో సమస్యను లేవనెత్తారు. 28 అంశాలతో కూడిన అజెండాను మున్సిపల్ సిబ్బంది చదివి వినిపించారు. రోడ్ల నిర్మాణం,ప్లాస్టిక్ నిషేదం అమలు, కాంట్రాక్టర్లకు పెండింగ్ బిల్లులు తదితర అంశాలపై కౌన్సిల్ సభ్యులు చర్చించారు. మున్సిపల్ చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్ మాట్లాడుతూ మోడల్ స్కూల్ రోడ్డు నిర్మాణానికి సంభందించి తగినంత నిధులు మున్సిపల్ కార్యాలయం పరిధిలో అందుబాటులో ఉండవని ప్రత్యామ్నాయంగా నిధుల సమీకరణకు కృషిచేసి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టటం జరుగుతుందని తెలిపారు. అన్ని వార్డులలో సమస్యల పరిష్కారానికి తగిన విధంగా ప్రణాళిక ప్రకారం ముందుకు వెళ్లటం జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశంలో వైస్ చైర్మన్ మాణిక్యరావు, కౌన్సిలర్లు, కమీషనర్ డివిఎస్ నారాయణరావు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## 'బ్యూటీపార్లర్'లో ఉచిత శిక్షణ

**ప్రజాశక్తి-ఒంగోలు**

నగరంలోని భాగ్యనగర్లో ఉన్న రూడ్సెట్ సంస్థలో మార్చి ఏడు నుంచి ఏప్రిల్ 5 వరకు బ్యూటీపార్లర్ మేనేజ్మెంట్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు సంస్థ డైరెక్టర్ ప్రతాప్రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని గ్రామీణ ప్రాంత మహిళలు 18 నుంచి 45 సంవత్సరాల లోపు వారికి ఈ శిక్షణ ఉంటుందన్నారు. శిక్షణతో పాటు భోజనం, వసతి కూడా పూర్తిగా ఉచితమని పేర్కొన్నారు. ఇతర వివరాలకు 8309915577 నెంబర్ను సంప్రదించాలని కోరారు.

# విద్యార్థులు అన్ని రంగాలలో రాణించాలి

## ఎమ్మెల్యే కుందురు

**ప్రజాశక్తి-పొదిలి**

విద్యార్థులు దేశ ప్రతిష్ట ఇనుమడించేలా అన్ని రంగాలలో తమ ప్రతిభాపాటవాలు చాటాలని మార్కాపురం శాసనసభ్యులు కుందురు నాగార్జునరెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో తాను పాఠశాల విద్యార్థుల కోసం రూపొందించిన ఇగ్నైట్ యంగ్ మైండ్స్ అనే కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా హబీబుల్లా బేగ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పాఠశాలకు 25 వేల రూపాయల మైక్ సెట్‌ను సంస్థ చైర్మన్ కరిముల్లా బేగ్ ఎమ్మెల్యే ద్వారా బహుకరించారు. అనంతరం ఎమ్మెల్యేను పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో డిప్యూటి డిఇఒ చంద్రమౌళి, పొదిలి, మర్రిపూడి ఎంఈఓలు ఎం శ్రీనివాసులు, ఇవి రంగయ్య, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం తారవాణి, మార్కాపురం ఏఎంసి చైర్మన్ గొలమారి శ్రీనివాస రెడ్డి, మాజీ ఏఎంసీ ఛైర్మన్ గుజ్జుల రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యేను సత్కరిస్తున్న దృశ్యం


నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే స్వామి

## రవికి ఎమ్మెల్యే స్వామి నివాళి

**ప్రజాశక్తి-జరుగుమల్లి**

మండలంలోని కె.బిట్రగుంట గ్రామానికి చెందిన రాయవరపు రవి(41) బుధవారం రాత్రి గుండెపోటుతో మృతిచెందారు. కొండపి ఎమ్మెల్యే డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి రవి మృతదేహానికి పూలమాల వేసి.. నివాళులర్పించారు. రవి కుటుంబసభ్యులను ఎమ్మెల్యే పరామర్శించి.. వారికి ధైర్యం చెప్పి.. పార్టీ ఎల్లప్పుడూ అండగా వుంటుందని భరోసా ఇచ్చారు. వీరి వెంట ఏలూరి రాంబాబు, వట్టిగుంట శివాజి, రాయవరపు నారాయణ, నిమ్మకాయల వెంకటేశ్వర్లు ఉన్నారు.

## వాసు మృతి పార్టీకి తీరని లోటు

### టిడిపి ఇన్‌ఛార్జి ఉగ్ర నరసింహారెడ్డి

**ప్రజాశక్తి-పామూరు**

టిడిపి ఎస్‌సి సెల్ అధ్యక్షులు బడుగు తిరుపతివాసు(40) మృతి పార్టీకి, వారి కుటుంబానికి తీరని లోటు అని టిడిపి కనిగిరి నియోజకవర్గ ఇన్‌ఛార్జి మాజీ శాసనసభ్యులు ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి అన్నారు. మండల పరిధిలోని నుచ్చుపొద గ్రామానికి చెందిన బడుగు తిరుపతివాసు సోమవారం ఇంటి వద్ద గుండెపోటు రావడంతో అతని స్నేహితుడు సహకారంతో పామూరు ప్రజావైద్యశాలకు తరలించారు. వైద్యం పొందుతూ పరిస్థితి విషమించడంతో మృతి చెందారు. నివాళులర్పించిన వారిలో మాజీ జడ్‌పిటిసి బొల్లా మాల్యాద్రి చౌదరి, డోలా శేషు, ప్రసాద్, విశ్రాంతి ఉద్యోగి మాలకొండయ్య, మహేష్, ఇరి కోటిరెడ్డి, మాల్యాద్రి, హనీఫ్ ఉన్నారు.

## మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

### మానవత్వం చాటుకున్న ఆఖీబ్ అహమ్మద్

**ప్రజాశక్తి-పొదిలి**

పొదిలి పట్టణంలోని నేతపాలెంకు చెందిన అంబటి నరేష్(33) గత కొంత కాలంగా పక్షవాతంతో బాధపడుతూ సోమవారం రాత్రి మృతిచెందారు. ఈ సందర్భంగా నిరుపేద అయిన నరేష్ కుటుంబానికి మట్టి ఖర్చుల నిమిత్తం పొదిలికి చెందిన ఐఎఎస్ అధికారి ఆరీఫ్ అహమ్మద్ సోదరులు లాల్ ఫౌండేషన్ అధినేత ఆకీబ్ అహమ్మద్ మంగళవారం రూ.5 వేలు ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ సభ్యులు మృతుడు తల్లికి ఈ మొత్తాన్ని అందించారు. మానవత్వంతో లాల్ ఫౌండేషన్ చేసిన దాతృత్వానికి పలువురు పట్టణ ప్రజలు అభినందనలు తెలిపారు.

## మధ్యాహ్న భోజనం పరిశీలన

**ప్రజాశక్తి-పొదిలి**

స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని డిప్యూటీ డిఇఒ చంద్రమౌళి మంగళవారం పరిశీలించారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం రుచి చూశారు. వంట వారితో మాట్లాడారు. ఆయన వెంట పాఠశాల ప్రధానోపాధ్యాయులు, మర్రిపూడి ఎంఇఓ ఇవి రంగయ్య, ఉపాధ్యాయులు ఉన్నారు.

## చట్టాలపై అవగాహన అవసరం

**ప్రజాశక్తి-దరిశి**

విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని న్యాయవాది బి.చెన్నకేశవులు అన్నారు. మంగళవారం స్థానిక గౌతమి గ్రామర్ స్కూల్‌లో స్ట్రీట్ చిల్డ్రన్స్ డే సందర్భంగా విద్యార్థులకు న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ప్రిన్సిపాల్ రామక్రిష్ణారెడ్డి అధ్యక్షత వహించగా న్యాయవాదులు సుబ్బారెడ్డి, మనోరమ్మ, విద్యార్థులు పాల్గొన్నారు.


వీఆర్వోను సత్కరిస్తున్న దృశ్యం

## ఉత్తమ వీఆర్వో శ్రీకాంత్‌కు సన్మానం

**ప్రజాశక్తి-కనిగిరి**

కనిగిరి పట్టణంలోని 5వవార్డు సచివాలయంలో విఆర్వోగా పనిచేస్తున్న బసిరెడ్డి శ్రీకాంత్ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా కలెక్టర్ ద్వారా ఉత్తమ వీఆర్వో పురస్కారాన్ని అందుకోవటం జరిగింది. కాగా ఉత్తమ పురస్కారం అందుకున్న విఆర్వో బసిరెడ్డి శ్రీకాంత్‌ను మంగళవారం సచివాలయంలో తోటి సిబ్బంది ఘనంగా సన్మానించి అభినందించారు. కనిగిరి మున్సిపాలిటీనుంచి ఉత్తమ పురస్కారానికి శ్రీకాంత్ ఎంపికై అందుకోవటం సంతోషకరమని మున్సిపల్ చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్ తెలియజేశారు. శ్రీకాంత్‌ను ఆదర్శంగా తీసుకుని సచివాలయ సిబ్బంది ప్రజలకు ఉత్తమ సేవలు అందించాలని సూచించారు. ఈకార్యక్రమంలో సచివాలయ అడ్మిన్ అబ్దుల్ మజీద్,వైసీపీ నాయకులు చొప్పరపు తిరపతయ్య, డాక్టర్ నాయబ్‌రసూల్, నాగూర్‌వలి, భారతి, నాగూర్‌బీ, గౌస్ తదితరులు పాల్గొన్నారు.

# పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థిని గెలిపించాలి

**ప్రజాశక్తి-కురిచేడు**

కార్మికులు సమస్యలపై జరుగుతున్న పోరాటాలకు మద్దతిస్తూ పాల్గొంటున్న పిడిఎఫ్ గ్రాడ్యుయేట్ అభ్యర్థి మీగడ వెంకటేశ్వరరెడ్డిని గెలిపించాలని సిఐటియు కురిచేడు మండల నాయకులు కోరారు. సిఐటియు మండల కమిటీ సమావేశం కె.సాల్మన్ అధ్యక్షతన మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా నాయకులు వి బాలకోటయ్య, ఎస్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ నిరంతరం ఉద్యోగులు, కార్మిక సమస్యల పట్ల అవగాహన కలిగి గత 30 సంవత్సరాల నుండి ప్రజా ఉద్యమాల్లో వెంకటేశ్వరరెడ్డి మమేకమయ్యారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సిఐటియు కార్యదర్శి నాగమల్లేశ్వరి, పంచాయతీ కార్మికుల యూనియన్ నాయకులు కె.అశోక్‌కుమార్, గుంజి శ్రీను పాల్గొన్నారు.


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సిఐటియు నాయకులు

## కోళ్ల ప్రదర్శనలో కొమరోలు వాసికి నాలుగో స్థానం

**ప్రజాశక్తి-కొమరోలు**

కొమరోలు మండలం, రాజుపాలెం గ్రామానికి చెందిన సయ్యద్ బాషాకు చెందిన కోడిపుంజుకు సత్యసాయి జిల్లా ధర్మవరంలో జరిగిన ఆల్ ఇండియా కోళ్ల ప్రదర్శనలో నాలుగో స్థానం సాధించింది. ఈ సందర్భంగా నిర్వాహకులు సోమవారం వారికి మెమెంటో, ప్రశంసాపత్రాన్ని అందజేశారు. ప్రతి సంవత్సరం నిర్వహించే ఈ పోటీలలో ఐదు నుంచి ఏడు రాష్ట్రాల వరకు పోటీలో పాల్గొంటాయి. కోళ్ల ప్రదర్శనలో కొమరోలు మండలం, రాజుపాలెం గ్రామానికి చెందిన సయ్యద్ బాషా పుంజు నాలుగో స్థానం సాధించడంతో రాజుపాలెం సర్పంచ్ హటేల్ పీరా షేక్ అభినందించారు. సయ్యద్‌బాషా గత రెండు సంవత్సరాల నుంచి కోళ్ల పెంపకంలో ఎన్నో మెళకువలు నేర్చుకొని ఆల్‌ఇండియా ప్రదర్శనలో నాలుగో స్థానం పొందడం ఎంతో గర్వ కారణమన్నారు. ముందు ముందు మొదటి స్థానంలో నిలవాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. గ్రామస్తులు పలువురు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.


కోడిపుంజుతో సయ్యద్‌బాషా

# గృహనిర్మాణాలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

## మండల ప్రత్యేకాధికారి అర్జున్‌నాయక్

**ప్రజాశక్తి-వెలిగండ్ల**

పేదలకు ఇచ్చిన లేఅవుట్‌లలో గృహ నిర్మాణాలు చేపట్టేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని మండల ప్రత్యేక అధికారి, ఎస్సీ, ఎస్టీ కార్పోరేషన్ ఇడి కె.అర్జున్‌నాయక్ అధికారులకు సూచించారు. మంగళవారం స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలో అధికారులతో సమావేశమై పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయడంతోపాటు సచివాలయాల్లో ప్రజలకు మెరుగైన సేవలు అందించేలా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఓ తాతపూడి సుకుమార్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ పవన్‌కుమార్, ఎపిఎం లక్ష్మీనారాయణ, వ్యవసాయశాఖ అధికారి రంగక్రిష్ణ, సర్వశిక్షా అభిమాన్ ఎఇ గేరా బాలక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి అర్జున్‌నాయక్

## వ్యవసాయ మంత్రిని కలిసిన మద్దిశెట్టి రవీంద్ర

**ప్రజాశక్తి-దరిశి**

నెల్లూరులో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాసాని గోవర్ధన్‌రెడ్డిను తాళ్ళూరు వైసిపి ఇన్‌చార్జి, స్థానిక శాసనసభ్యులు మద్దిశెట్టి వేణుగోపాల్ సోదరుడు మద్దిశెట్టి రవీంద్ర మర్యాదపూర్వకంగా కలిశారు. మంగళవారం ఆయనను కలిసి పలు విషయాలపై చర్చించారు.


మంత్రితో రవీంద్ర

## గుండెపోటుతో యుటిఎఫ్ నేత వీరకుమార్ మృతి

**ప్రజాశక్తి-మార్కాపురం**

యుటిఎఫ్ మార్కాపురం పట్టణ శాఖ ప్రధాన కార్యదర్శి నంద్యాల వీరకుమార్(46) గుండెపోటుతో మంగళవారం ఉదయం తన నివాస గృహంలో మృతిచెందాడు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. వీరకుమార్ మర్కాపురం మున్సిపాలిటీలోని ఏకలవ్య కాలనీలో గల మున్సిపల్ పాఠశాలలో ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్నారు. అభ్యుదయ భావాలు కలిగిన వీరకుమార్ మృతితో తోటి ఉపాధ్యాయులు కంటతడి పెట్టారు. వీరకుమార్ భౌతికకాయాన్ని స్వగ్రామమైన గిద్దలూరుకు తరలించారు. బుధవారం ఉదయం గిద్దలూరులో అంత్యక్రియలు నిర్వహిస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. యుటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఒద్దుల వీరారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి బి.శ్రీరాములు, జిల్లా కార్యదర్శులు పి.ప్రభాకర్, వెన్నా వెంకటరెడ్డి, మున్సిపల్ ఉపాధ్యాయుల జిల్లా కన్వీనర్ ఎన్ఎస్ఎల్ రవికుమార్, పట్టణ శాఖ గౌరవాధ్యక్షులు తాటిపర్తి సత్యనారాయణరెడ్డి, అధ్యక్షులు దండా వెంకటరెడ్డి, కోశాధికారి ఎం.శ్రీనివాసనాయక్ వీరకుమార్ భౌతికయానికి పూలమాలలు వేసి.. నివాళులు అర్పించారు.


వీరకుమార్ (ఫైల్)

## పిసిపల్లి పోలీసులకు అభినందనలు

**ప్రజాశక్తి-పిసిపల్లి**

ఓ కేసులో నిందితులకు శిక్ష పడే విధంగా కృషి చేసిన పిసిపల్లి పోలీసులను ఎస్పీ మల్లికగర్గ్ మంగళవారం అభినందించారు. 2017 మార్చి రెండున తెల్లవారుజామున మూడు గంటల సమయంలో పిసిపల్లి మండలం పెదఅలవలపాడు పాలేరు సమీపంలో స్కూల్ విద్యార్థుల బస్సు బోల్తా పడింది. కరేడు హైస్కూల్ విద్యార్థులు మహానంది విహారయాత్రకు వెళ్ళి తిరుగుసమయంలో డ్రైవర్ నిద్రమత్తుతో ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఒక విద్యార్థి మృతి చెందారు. ఈ కేసుకు సంబంధించి స్థానిక ఎస్ఐ ఎ.నాగేశ్వరరావు, హెడ్‌కానిస్టేబుల్ డి.గోవిందరాజులు కోర్టుకు నివేదిక అందజేసి.. ముద్దాయిలకు శిక్షపడే విధంగా కృషి చేసినందుకు ఎస్‌పి అభినందనలు తెలిపారు.

## ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలి

**ప్రజాశక్తి-గిద్దలూరు**

వైసీపీ పాలనలో ప్రజలకు జరుగుతున్న అన్యాయా లను ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజలకు వివరించాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆయన టిడిపి ముఖ్యనాయకులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షులు సయ్యద్ శానేశావలి, పార్లమెంట్ ఉపాధ్యక్షులు గోపారపు గోపాల్‌రెడ్డి, అధికార ప్రతినిధి షేక్ మహబూబ్‌బాషా, పార్లమెంట్ తెలుగుయువత ప్రధాన కార్యదర్శి బోయిలపల్లి కిషోర్, నాయకులు గిద్దలూరు మద్దిలేటి, పందీటి రజిని బాబు పాల్గొన్నారు.


మద్దిశెట్టి శ్రీధర్‌ను సన్మానిస్తున్న బత్తినేని

## తూర్పువెంకటాపురం సొసైటీ చైర్మన్‌గా 'బత్తినేని'

**ప్రజాశక్తి-దరిశి**

మండలంలోని తూర్పు వెంకటాపురం సొసైటీ చైర్మన్‌గా బత్తినేని వెంకటేశ్వర్లు ఎన్నికయ్యారు. స్థానిక ఎమ్మెల్యే డాక్టరు మద్దిశెట్టి వేణుగోపాల్ రాజంపల్లికి చెందిన జగనన్న సచివాలయాల మండల కన్వీనరు బత్తినేని వెంకటేశ్వర్లు పేరును తూర్పువెంకటాపురం సొసైటీ చైర్మన్‌గా సిఫారుసు చేసి అధికారులకు లెటర్ పంపించారు. ఈ సందర్భంగా బత్తినేని వెంకటేశ్వర్లు ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్ క్యాంపు కార్యాలయంలో మద్దిశెట్టి శ్రీధర్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపిపి గోళ్లపాటి సుధారాణి అచ్చయ్య, నాయకులు విజయ్, వెంకయ్య, మురళి, రామక్రిష్ణ పాల్గొన్నారు.

# మురుగు నీటి నుంచి కాపాడండి

**ప్రజాశక్తి-కొండపి**

'మురుగు నీటి నుంచి గ్రామస్థులను కాపాడండి' అంటూ మంగళవారం నాడు కొండపి మండలం పెరిదేపి సచివాలయంలో పంచాయతీ కార్యదర్శి అశోక్‌కు పెరదేపి సిపిఎం నాయకులు వినతిపత్రం అందజేశారు. పెరిదేపి గ్రామంలో ప్రధాన మురుగు కాలువలు మాలపల్లె వైపునకు వస్తున్నాయని, వీటివల్ల పల్లె ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారని గ్రామస్థులు అంటున్నారు. ఈ విషయంపై సిపిఎం మండల కార్యదర్శి కెజి మస్తాన్ మాట్లాడుతూ ప్రజలు అనేక వ్యాధుల బారిన పడుతూ ఆర్థికంగా, ఆరోగ్యపరంగా రాకపోకలకు ఇబ్బందులకు గురవుతుంటే తగు చర్యలు తీసుకోవాల్సిన పంచాయతీ సిబ్బంది, పాలక పక్షం చోద్యం చూస్తున్నారని విమర్శించారు. పంచాయతీ ఆరో వార్డు సభ్యులు కాలే మల్లిఖార్జున్ మాట్లాడుతూ మాలపల్లె వైపునకు వెళుతున్న మురుగు నీటిని దారి మళ్లించాలనే అంశాన్ని పంచాయతీ సమావేశాల్లో అనేకమార్లు అధికారులకు విన్నవించుకున్నప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోకుండా కాలయాపన చేయటం బాధాకరమని అన్నారు. ఊరిపై నుంచి వచ్చే మురుగు కాలువ మాలపల్లె సైడు కాలువకు మళ్లించారని, దాని వలన మురుగునీరు రోడ్డు మీదకు చేరుతోందని, దీంతో ప్రజలు, వాహనదారులు నడవటానికి భయపడుతున్నారని అన్నారు. గతంలో ఈ రోడ్డుపై అనేకమంది జారిపడ్డారని పేర్కొన్నారు. ఆ మురుగు నీరు రోడ్డుపైనే కాకుండా దగ్గర ఇండ్లకు చేరుతోందని, దాని వలన అక్కడ ఉండేవారు అనారోగ్యానికి గురవుతున్నారని అన్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు మల్లెల కొండయ్య, మల్లెల పెద్ద పేతురు పాల్గొన్నారు.



పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందచేస్తున్న పెరిదేపి ఆరో వార్డు సిపిఎం మెంబర్ కాలే మల్లిఖార్జునరావు



రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగునీరు

## డబ్బులు లాక్కున్న ఇద్దరు అరెస్టు

**ప్రజాశక్తి-వేటపాలెం**

పోలీసులమని చెప్పి, వేటపాలెం బైపాస్‌లో మోటార్ సైకిల్ మీద పోతున్న వారిని చంపుతాము అని బెదిరించి ఇద్దరు నిందితుల కటకటాల పాలయ్యారు. వేటపాలెం ఎస్ఐ జి సురేష్ మంగళవారం స్థానిక స్టేషన్‌లో విలేకర్లకు వివరాలు వెల్లడించారు. చినగంజాంకు చెందిన వడ్లమూడి వెంకటరావు వద్ద నుంచి రూ.700 డబ్బులు లాక్కున్న ముగ్గురిపై వేటపాలెం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు చెప్పారు. రాబడిన సమాచారం మేరకు ముగ్గురు నిందితులలో స్థానిక రిక్షా కాలనీకి చెందిన నక్క రమణారెడ్డి, కొత్త యానాది సంఘానికి చెందిన చలమచర్ల రాంబాబులను అరెస్ట్ చేశామని పేర్కొన్నారు. నిందితుల ఆధీనంలో ఉన్న, ఈ నేరానికి ఉపయోగించిన 7613 నెంబర్ గల బుల్లెట్ మోటార్ సైకిల్‌ను స్వాధీనం చేసుకొన్నట్లు చెప్పారు. ఈ కేసులో మరో నిందితుడు దుర్గారావు కోసం గాలిస్తున్నామని పేర్కొన్నారు. 216 జాతీయ రహదారిలో వరుస దోపిడీలకు పాల్పడుతున్న ముఠాలో గుర్తు తెలియని పోలీసు సైతం ఉన్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ కేసు విషయమై ప్రజాప్రతినిధుల వద్ద పంచాయతీ సైతం జరిగినట్లు సంబంధిత శాఖ అధికారులే గుసగుసలాడుతున్నారు.

## వివాహ వేడుకల్లో మాజీ మంత్రి

**ప్రజాశక్తి-భట్టిప్రోలు**

మండలంలోని ఐలవరం గ్రామంలో మంగళవారం టిడిపి నాయకులు అవ్వరు వెంకటేశ్వరరావు కుమార్తె వివాహ వేడుకలకు మాజీమంత్రి, టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు నక్కా ఆనంద బాబు పాల్గొని నూతన వధూ వరులను ఆశీర్వదించారు. వేమూరు మండలంలో ఆయన పలు కార్యక్రమాలలో పాల్గొన్నారు. ఈయన వెంట ఐలవరం గ్రామ పార్టీ నాయకులు మాచర్ల నాగరాజు, దీపాల ప్రసాద్, డోలా, పంచుమర్తి శంకరరావు తదితరులు ఉన్నారు.



వధూవరులను ఆశీర్వదిస్తున్న మాజీ మంత్రి ఆనందబాబు

## డిఆర్‌డిఏ పిడి వైఖరి పట్ల సిబ్బంది నిరసన

**ప్రజాశక్తి-బాపట్ల జిల్లా**

బాపట్ల జిల్లా డిఆర్‌డిఏ ప్రాజెక్టు డైరక్టర్ అర్జున్‌రావు అనుసరిస్తున్న వైఖరి పట్ల కార్యాల య సిబ్బంది, జిల్లా వెలుగు కార్యాలయాల అధికారులు మంగళవారం తమ నిరసన తెలిపారు. జిల్లాలో తాము కష్టపడి పని చేస్తున్న ప్పటికీ పీడీ తమను అసభ్య పదజాలంతో తిడుతూ, ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని ఆరోపిస్తూ మున్సిపల్ పార్కులో సమావేశమయ్యారు. రాష్ట్రంలో బాపట్ల జిల్లాను ఐదో స్థానంలో ఉంచుతూ ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల చెంతకు చేరుస్తూ జిల్లాకు మంచి పేరు తీసుకు వస్తున్నప్పటికీ పీడి అర్జునరావు సిబ్బందిని బానిసల్లా చూస్తూ నా కొడకల్లారా అంటూ సంబోధిస్తూ హీనంగా మాట్లాడుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో తమ పట్ల పీడీ అనుసరిస్తున్న వైఖరి గురించి చర్చించిన డిఆర్‌డిఏ అధికారులు, సిబ్బంది ఇదే పంథా పీడి కొనసాగిస్తే పోరాటం చేయాలని నిర్ణయించారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు.



మున్సిపల్ పార్కులో సమావేశమైన డిఆర్డిఏ సిబ్బంది

## సమస్యలను వెంటనే పరిష్కరించాలి

**ప్రజాశక్తి-కొండపి**

గ్రామంలో ఉండే చిన్న చిన్న సమస్యలను వెంటనే పరిష్కరించాల్సిన బాధ్యత సచివాలయం సిబ్బందిపై ఉందని వైసిపి కొండపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి వరికూటి అశోక్‌బాబు తెలిపారు. మంగళవారం కొండపి మండలం చోడవరం గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఒక యువకుడు అశోక్‌బాబుతో మాట్లాడుతూ నాకు టిడిపి ప్రభుత్వంలో ఉన్న రేషన్‌కార్డును వైసిపి ప్రభుత్వం వచ్చిన తరువాత తీసివేశారని, దానికి సంబంధించిన కాగితాలు తెచ్చినా సచివాలయం సిబ్బంది స్పందించడం లేదని వివరించారు. రేషన్ కార్డు లేనందువల్ల ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలు ఏమీ అందడం లేదని, రోజువారి కూలి పనులు చేసుకొని బతికేవారమని వివరించారు. గ్రామంలో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని అశోక్‌బాబును కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ వైసిపి నాయకులు, మండలంలోని వైసిపి నాయకులు, సచివాలయం సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.



అశోక్‌బాబుకు సమస్యలను వివరిస్తున్న చోడవరం గ్రామస్థులు

## మాజీ మున్సిపల్ ఛైర్మన్ కస్తూరిబాయి మృతి

**ప్రజాశక్తి-చీరాల**

చీరాల మున్సిపల్ మాజీ మున్సిపల్ ఛైర్మన్ అందే కస్తూరిబాయి మంగళవారం పేరాలలోని తమ నివాసంలో కన్నుమూశారు. ఆమె వయసు 76 సంవత్సరాలు కాగా గత కొంతకాలంగా అస్వస్థతతో బాధపడుతున్నారు. పరిస్థితి విషమించటంతో మంగళవారం మధ్యాహ్నం ఆమె తుది శ్వాస విడిచారు. కస్తూరిబాయి మరణం పట్ల పలువురు ప్రముఖులు, రాజకీయ నేతలు, ప్రజలు సంతాపం తెలిపారు



## మధ్యాహ్న భోజనంలో మెనూ అమలు: డిప్యూటీ డిఇఓ

**ప్రజాశక్తి-చెరుకుపల్లి**

మధ్యాహ్న భోజన పథకం అమలులో ఎటువంటి రాజీ పడవద్దని బాపట్ల డిప్యూటీ డీఈవో గల్లా వెంకటేశ్వర్లు ఆదేశించారు. మంగళవారం గుల్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని ఆయన తనిఖీ చేసి పలు సూచనలు అందజేశారు. ప్రభుత్వ మెనూ ప్రకారం భోజనాన్ని అందజేయాలని సూచించారు. భోజనాన్ని తిని సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులు అందరూ భోజనాన్ని తినేలా సిబ్బంది కృషి చేయాలని ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు పులి లాజర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## భట్టిప్రోలులో చేతి పంపుల రిపేర్లు

**ప్రజాశక్తి-భట్టిప్రోలు**

మండల కేంద్రం భట్టిప్రోలులోని 14వ వార్డు పురంవారి వీధిలో పాడైపోయిన చేతి పంపులను మంగళవారం గ్రామ సర్పంచ్ దారా రవికిరణ్మయి సిబ్బందితో రిపేరు చేయించారు. గ్రామంలో నీటి వసతికి ఇబ్బంది లేకుండా పంచాయతీ తరపున యుద్ధప్రాతిపదికన చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. పాలకవర్గ సభ్యులు తమ తమ వార్డులలో సమస్యలు ఉంటే గుర్తించాలని కోరారు.

## భూసార పరీక్షలు చాలా ముఖ్యం

**ప్రజాశక్తి-కొండపి**

రైతులు భూసార పరీక్షలు చేయించుకోవడం ముఖ్యమని, భూసార పరీక్షలో సూచించబడిన ఎరువుల మోతాదు ఆధారంగానే రైతులు ఎరువులను వాడాలని సింగరాయకొండ సబ్ డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు డాక్టర్ ఈ నిర్మలకుమారి రైతులకు తెలిపారు. మంగళవారం నాడు కొండపి మండలంలోని అనకర్లపూడి గ్రామంలో గ్రామ వ్యవసాయ సహాయకులు పి భరత్‌కుమార్ ఆధ్వర్యంలో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఛైర్ పర్సన్ ఎల్ ఎస్తేరమ్మ

## కౌన్సిల్ సభ్యులు సహకరించాలి

**ప్రజాశక్తి-అద్దంకి**

పట్టణ అభివృద్ధికి కౌన్సిల్ సభ్యులు సహకరించాలని పురపాలక సంఘం ఛైర్‌పర్సన్ ఎల్ ఎస్తేరమ్మ అన్నారు. మంగళవారం పురపాలక సంఘం కౌన్సిల్ సమావేశం హాల్లో సాధారణ సమావేశం ఛైర్ పర్సన్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలో పలు అభివృద్ధి అంశాలపై 31 అంశాల గురించి కౌన్సిలర్ ఆమోదం కోసం చర్చించారు. 74వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా పురపాలక సంఘంలో పనిచేస్తున్న ఉద్యోగులకు జిల్లా కలెక్టర్ ఉత్తమ ప్రశంసా పత్రాలను అందించిన సందర్భంగా వారిని ఛైర్‌పర్సన్‌తో పాటు వైస్ ఛైర్మన్ దేస్ పద్మేష్, కె అనంతలక్ష్మి కౌన్సిలర్లు కలిసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ టి రవికుమార్, మేనేజర్ శ్రీదేవి, ఏఈ రోహిణి, పురపాలక సంఘం ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.



వలవేసి పిచ్చికుక్కను పట్టుకున్న దృశ్యం

## పిచ్చి కుక్క స్వైర విహారం

**ప్రజాశక్తి-పంగులూరు**

మండల కేంద్రమైన పంగులూరులో గత 20 రోజులుగా పిచ్చికుక్క దాదాపు 25 మందిని కరిచింది. ఈ కుక్క బెడదకు రోడ్డు మీదకు రావాలంటే గ్రామస్తులు భయపడిపోయారు. గ్రామస్తుల ఫిర్యాదు మేరకు ఈరోజు కుక్కలు పట్టుకునే వారిని పిలిపించారు. కుక్కను పట్టుకొని ఊరికి దూరంగా వదిలిపెట్టినట్లు గ్రామ సర్పంచ్ గుడిపూడి నాగేంద్రం రామారావు తెలిపారు. ఈ పిచ్చి కుక్కతో పాటు మరికొన్ని కుక్కలు గ్రామంలోకి ఎక్కడ నుంచో వచ్చినట్టు తెలిపారు. మిగిలిన కుక్కలను కూడా రెండు మూడు రోజుల్లో పట్టుకుని గ్రామానికి దూరంగా వదిలిపెడతామని తెలిపారు. గత వారం రోజులుగా పంగులూరులోని ఎస్‌బిఐ వద్ద సుమారు 15 మందిని కరిచిందని, మూడు రోజులుగా పెద్ద బజారు నుంచి లైబ్రరీ వెళ్లే దారిలో సుమారు 7 మందిని కరిచిందని తెలిపారు. గ్రామస్తులు ఇచ్చిన ఫిర్యాదును రెండు రోజుల్లో పరిష్కరించినందుకు సర్పంచ్‌కి గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

## చిరుధాన్యాలపై అవగాహన

**ప్రజాశక్తి-అమృతలూరు**

మంగళవారం మండలంలోని కూచిపూడి గ్రామంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ చిరుధాన్యాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బాపట్ల డిఆర్‌సి కేంద్రం నుంచి వచ్చిన ఉమామహేశ్వరి రైతులకు చిరుధాన్యాలపై పలు సూచనలు చేశారు. బాపట్ల ఏడిఏ లక్ష్మి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ కమిషనర్ కార్యాలయం నుంచి పర్యవేక్షకులుగా వచ్చిన ఎన్ పద్మజ మాట్లాడుతూ చిరుధాన్యాలు సాగు చేసేందుకు ఔత్సాహిక రైతులకు ప్రభుత్వం రాయితీలు కలిగిస్తుందని తెలియజేశారు. లాంఫారం కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త గంగాదేవి మాట్లాడుతూ చిరుధాన్యాల పోషక విలువలు మానవునికి నిదానంగా జీర్ణం అవుతాయని, త్వరగా షుగర్ వ్యాధి లాంటివి రాకుండా ఉంటాయని వివరించారు. ఈ కార్యక్రమంలోఅమృతలూరు మండల వ్యవసాయ అధికారి శ్రీమతి వి లోకేశ్వరి, వ్యవసాయ విస్తరణ అధికారులు ఐ శ్రీకాంత్, కె లక్ష్మీ ప్రసన్న, ప్రవల్లిక, మండలంలోని రైతు సోదరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అధికార పార్టీ కౌన్సిలర్ల నోటికి తాళం.!

**- సమస్యలపై ప్రస్తావించొద్దని సంకేతాలు..**
**- అసహనంతో కౌన్సిల్ సమావేశాలకు దుమ్మా కొడుతున్న అధికార పార్టీ సభ్యులు**

**ప్రజాశక్తి-మార్కాపురం**

మార్కాపురం మున్సిపల్ కౌన్సిల్ సమావేశానికి కొందరు కౌన్సిలర్లు తరచూ డుమ్మా కొడుతున్నారు. డుమ్మా కొడుతున్న వారిలో అధికార పార్టీ కౌన్సిలర్లే అధికంగా ఉండటం విశేషం. నెలకు ఒక్కసారి జరిగే కౌన్సిల్ సమావేశానికి హాజరు కాకపోవడంలో ఆంతర్యమేమిటని ఆరా తీయగా... కౌన్సిల్ సమావేశంలో సమస్యలు ప్రస్తావించొద్దని హుకుం జారీ చేయడమే అందుకు కారణంగా తెలుస్తోంది.! అధికారంలో ఉండీ అనుకున్న మేర వార్డుల్లో పనులు చేయలేకపోయామని, కనీసం చిన్నపాటి సమస్యలు కూడా పరిష్కరించడంలో విఫలమవుతున్నామని కొందరు కౌన్సిలర్లు మదనపడుతున్నారు. కౌన్సిల్ సమావేశంలో ఏదైనా పని చేయాలని కోరినా... సమస్య తీర్చాలని ప్రాధేయపడినా... సమావేశంలో కాదు... మనకు బాస్ ఉన్నాడు... అక్కడ మాత్రమే అడగాలని మున్సిపల్ చైర్మన్ చిర్లంచెర్ల బాలమురళీక్రిష్ణ పదే పదే సమావేశంలో అడ్డు తగులుతుండటంతో కౌన్సిలర్ల నోటికి తాళం వేసినట్లుగా ఉందని ఆ పార్టీకి చెందిన కొందరు కౌన్సిలర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అందుకే ఒకరిద్దరు మాత్రమే మొక్కుబడిగా మాట్లాడటంతో కౌన్సిల్ సమావేశం ముగిసిపోతోంది. నెలనెలా జరుగుతున్న కౌన్సిల్ సమావేశాలకు ప్రతిపక్ష టిడిపి కౌన్సిలర్లతో కలుపుకున్నా.... 20కి మించడం లేదు. మార్కాపురం మున్సిపాలిటీలో 35 మంది కౌన్సిలర్లు ఉండగా అందులో 30 మంది వైసిపికి చెందిన వారు కాగా మిగిలిన ఐదుగురు టిడిపికి చెందిన కౌన్సిలర్లు ఉన్నారు. గతంలో జరిగిన పలు సమావేశాల్లోనూ చైర్మన్ చిర్లంచెర్ల బాలమురళీక్రిష్ణ సమావేశాలకు హాజరవుతే మాత్రమే రిజిష్టర్‌లో సంతకాలు తీసుకోవాలని.... అధికారులను ఆదేశించడం జరిగింది. అయిననూ కౌన్సిలర్లలో మార్పు రావడం లేదు. ఎవరి మీద అలకో తెలియదు కానీ... అధికార పార్టీ కౌన్సిలర్లలో మూడొంతులకు పైగా గుర్రుగా ఉన్నారు. అందుకే తరచూ సమావేశాలకు డుమ్మా కొడుతూ నిరసన తెలుపుతున్నారు. స్థానికంగా ఆ పార్టీ పెద్దలు కూడా కౌన్సిలర్ల హాజరుపై దృష్టి సారించినట్లు లేదేమో...!


వార్డుల్లో సమస్యలు వివరిస్తున్న కౌన్సిలర్లు, మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ చిర్లంచెర్ల

తాజాగా మార్కాపురం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం చైర్మన్ చిర్లంచెర్ల బాలమురళీక్రిష్ణ అధ్యక్షతన స్థానిక శ్రీపొట్టి శ్రీరాములు కౌన్సిల్ హాలులో మంగళవారం జరిగింది. సమావేశం ప్రారంభంలో కేవలం 9 మంది కౌన్సిలర్లతో ప్రారంభమైంది. వాస్తవంగా కోరం సరిపోదు సమావేశం ప్రారంభమైన అర్ధగంట తరువాత సమయానికి ఒక్కోక్కరుగా 17 మంది చేరుకున్నారు. సగం మందికి పైగా డుమ్మా కొట్టారు. ప్రతి సారీ ఇదే జరుగుతోంది.

కౌన్సిల్ సమావేశానికి హాజరైన కొద్ది మందిలోనూ అసహనంతో మాట్లాడిన వారే ఉన్నారు. 32వ వార్డుకు చెందిన అధికార పార్టీ కౌన్సిలర్ షేక్ చిన్న షెక్షావలి హార్పత్ మసీదు వద్ద మురుగు కాలువలు మురుగు నీటితో పొంది పొర్లుతున్నాయని, ఆ మురుగు నీరు నివాస గృహాల్లోకి చేరుతున్నాయన్నారు. చాలా కాలంగా ఈ సమస్య చెప్పినా పట్టించుకోవడం లేదన్నారు. శ్మశాన వాటిక అభివృద్ధికి రూ. 5 లక్షలు మంజూరు చేసినట్లు చెప్పారని, నిధులు ఎప్పుడిస్తారో చెప్పలేకున్నారన్నారు. బలపాల మిషన్ రోడ్డు వర్షాల సమయంలో జారుడు బల్లగా మారిందన్నారు. దత్తసాయి గుడి వీధిలో విద్యుత్ లైన్‌లు లేవని, విద్యుత్ స్తంభాలు, దీపాలు వెలిగించాలని కోరినా ఫలితం లేకపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు.

అధికార పార్టీకి చెందిన 4వ వార్డు కౌన్సిలర్ డాక్టర్ చెప్పల్లి కనకదుర్గ కూడా ఆవేదనతో మాట్లాడారు తమ వార్డులో ఒక్క రోడ్డు కూడా నిర్మించలేరా అంటూ ప్రశ్నించారు.

మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ ఇస్మాయిల్ రహదారుల సంగతేమో కానీ.. తమ వార్డులో మురుగు కాలువలు నిర్మించాలని కోరారు. 16వ వార్డులో పందుల పెంపకం జరుగుతోందని, స్థానికంగా జనం అసౌకర్యానికి గురవుతున్నారని ఆ వార్డు కౌన్సిలర్ దారివేముల హర్షిత బాబి వాపోయారు.

టిడిపికి చెందిన 33వ వార్డు కౌన్సిలర్ నాలి కొండయ్య నిధులు దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపించారు. విద్యుత్ వెలుగుల్లోనూ అధికార పార్టీ రంగు కనబడేందుకు రూ. 5 లక్షలు ఖర్చు చేయడం ఏమిటని ప్రశ్నించారు కాలేజి రోడ్డులో వెలుగుతున్న విద్యుత్ దీపాల స్తంభాలకు సీరియల్ సెట్ లైటింగ్ కోసం ఆ నిధులు ఖర్చు చేసే బదులు... రహదారులు లేని వీధులు ఎన్నో ఉన్నాయన్నారు. మురుగు కాలువలు లేని ప్రాంతాలు మరెన్నో ఉన్నాయన్నారు. అవసరాన్ని గుర్తించి నిధులు ఖర్చు చేయాలని సూచించారు

అజెండాలోని 25వ అంశంగా చేర్చిన బీహార్ మాజీ ముఖ్యమంత్రి బ్రిందేశ్వర్ ప్రసాద్ మాండల్ యాదవ్ మున్సిపల్ ఆవరణల ప్రతిష్టించే విషయమై చర్చకు దారితీసింది. ఆయన విగ్రహం పెడితే స్వర్గీయ కొణిజేటి రోశయ్య విగ్రహం కూడా ఏర్పాటు చేయాలని 27వ వార్డు కౌన్సిలర్ కశ్శెట్టి నగేష్‌కుమార్ డిమాండ్ చేశారు. ఇదే విధంగా పలువురు కౌన్సిలర్లు తమతమ సామాజిక వర్గాలకు చెందిన స్వర్గస్తులైన ప్రముఖుల విగ్రహాలు కూడా ఏర్పాటు చేయాల్సిందేనని కోరడం జరిగింది. సమావేశంలో 2వ వైస్ చైర్మన్ సిహెచ్ అంజమ్మ శ్రీనివాస్, మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు గుంటక వనజాక్షి చెన్నారెడ్డి, పఠాన్ అమీరుల్లాఖాన్, సయ్యద్ అబిదా ఖాశిం, పలువురు కౌన్సిలర్లు, మున్సిపల్ కమిషనర్ బిఎస్ గిరికుమార్, మేనేజర్ ఎస్ శ్రీనివాసన్, డిఇ షేక్ సుభానీ, ఏఇ పి.ఆదినారాయణ, ఆర్ఓ బి రంగారావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ షేక్ నాయబ్ రసూల్ తదితరులు పాల్గొన్నారు.


వైద్య శిబిరానికి వచ్చిన గిరిజనులు

## పాలుట్ల గిరిజన గూడెంలో వైద్య శిబిరం

**ప్రజాశక్తి-యర్రగొండపాలెం**

మండలంలోని దట్టమైన నల్లమల అటవీ ప్రాంతంలో గల పాలుట్ల గిరిజన గూడెంలో మంగళవారం పాలుట్ల ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ పి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. సీజనల్ వ్యాధులకు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. జ్వరపీడితులకు రక్తపూతలు సేకరించి అవసరమైన మందులు అందజేశారు. గర్భిణీలు, చిన్నారులకు వ్యాక్సిన్లు వేశారు. రక్తహీనతతో బాధపడుతున్న రోగులకు ఐరన్ టానిక్‌లు, ప్రొటిన్ పౌడర్లు అందజేశారు. గజ్జి, తామర లాంటి చర్మ వ్యాధులకు పూత మందులు, మాత్రలు పంపిణీ చేశారు. కుష్టు వ్యాధి సంబంధిత మచ్చలను పరిశీలించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని ఆరోగ్య విద్యను బోధించారు. దోమల బారిన పడకుండా దోమ తెరలు వాడాలని సూచించారు. డిడిటి, ఎబెట్ మందులను పిచికారి చేయించారు. ఈ వైద్య శిబిరంలో వైద్య సిబ్బంది బాషా, జానారెడ్డి, అంజమ్మ, జ్యోతిరాణి, నలగాటి వెంకట్రామయ్య నాయుడు, కొండయ్య, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఏవో జవహర్‌లాల్ నాయక్

## రైతులకు ఈకేవైసీ కార్డులు పంపిణీ

**ప్రజాశక్తి-పెద్దదోర్నాల**

దోర్నాల మండలం, కటకానిపల్లిలో గల ఆర్‌బీకే కార్యాలయంలో మంగళవారం మండల వ్యవసాయ అధికారి జవహర్‌లాల్ నాయక్ ఆధ్వర్యంలో రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జవహర్‌లాల్ నాయక్ మాట్లాడుతూ ఈ క్రాఫ్, ఈకేవైసీ చేసుకున్న రైతాంగానికి కార్డులు పంపిణీ చేశారు. రైతులు సాగు చేసిన పంటలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. మందులు విపరీతంగా పిచికారి చేయకూడదని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది, ఆర్బికే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.


మహంకాళయ్యను పరామర్శిస్తున్న మంత్రి సురేష్

## మహంకాళయ్యకు మంత్రి పరామర్శ

**ప్రజాశక్తి-త్రిపురాంతకం**

మండలంలోని త్రిపురాంతకం పంచాయతీ సర్పంచ్ పొన్న వెంకటలక్ష్మి భర్త పంచాయతీ రాజ్ ఏఈ మహంకాళయ్య వారం రోజులుగా అనారోగ్యానికి గురై కోలుకొని త్రిపురాంతకం తమ స్వగహానికి రాగా రాష్ట్ర పురపాలక, పట్టణాభివద్ధి మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ మంగళవారం ఆయనను పరమర్శించి పూర్తిగా ఆరోగ్యం కోలుకోవాలని తిరిగి విధులు నిర్వహించాలని ఆయన తెలిపారు. ఆయన వెంట జిల్లా గ్రంధాల చైర్మన్ రాచగొర్ల వెంకట పిచ్చయ్య యాదవ్, వైసీపీ కన్వీనర్ సింగారెడ్డి పోలిరెడ్డి, ఎంపీపీ కోట్ల సుబ్బారెడ్డి, వైసిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# సిఫార్సులు లేకుండా సంక్షేమ పథకాలు

**రాష్ట్ర మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్**

**ప్రజాశక్తి-యర్రగొండపాలెం, పుల్లలచెరువు**

ఎలాంటి సిఫార్సులు లేకుండా.. రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించాలన్న ఉద్దేశంతోనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి సచివాలయ వ్యవస్థను ప్రవేశపెట్టారని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ పేర్కొన్నారు. మంగళవారం పుల్లలచెరువు మండలంలోని యండ్రపల్లి గ్రామంలో రూ. 40 లక్షల వ్యయంతో నిర్మించిన గ్రామ సచివాలయాన్ని ప్రారంభించారు. ఆ సంధర్భంగా జరిగిన సభలో మంత్రి సురేష్ మాట్లాడుతూ ప్రజలకు ఏ సమస్య ఉన్నా, అర్హత ఉండి కూడా సంక్షేమ పథకాలు మంజూరు కాకపోతే తన దష్టికి తీసుకువస్తే తక్షణమే పరిష్కారమయ్యేలా చూస్తానని హామీ ఇచ్చారు. సకల జన సంక్షేమం పేరుతో వ్యక్తిగతంగా వీలైనంత ఎక్కువ మంది ప్రజలకు లబ్ధి చేకూర్చాలనే ఆలోచనన సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డిలో కనిపిస్తోందని తెలిపారు. గత టీడీపీ హయాంలో ఇచ్చిన హామీల్ని నెరవేర్చడంలో విఫలమయ్యారని ఆరోపించారు. జగనన్న ప్రభుత్వం పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలను అందిస్తున్నట్లు తెలిపారు. అభివద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. గతంలో వద్ధులు పింఛన్లు తీసుకోవడానికి గ్రామ పంచాయితీలకు వచ్చి సొమ్మ సిల్లి పడిపోయేవారని చెప్పారు. ఇప్పుడు ఒకటో తేదీన ఇంటి వద్దకే వలంటీర్లు వెళ్లి పింఛన్లు అందజేస్తున్నారని పేర్కొన్నారు. ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి ప్రజలను ఆదుకుంటున్న జగనన్నను తిరిగి ఆశీర్వదించాలన్నారు. అనంతరం మంత్రి సురేష్‌ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి చైర్మన్ ఉడుముల శ్రీనివాసరెడ్డి, వైసిపి మండల కన్వీనర్ బివి సుబ్బారెడ్డి, ఎంపిపి మందా లాజరు, జడ్పిటిసి వాగ్యా నాయక్, యండ్రపల్లి సర్పంచ్ తాళ్లపల్లి నర్సమ్మ, డిఎల్‌డివో బివిఎన్ సాయికుమార్, ఎంపిడివో రాజ్యలక్ష్మి, తహశిల్దార్ దాసు, పంచాయితీ కార్యదర్శి నలగాటి ఆత్మానంద సత్యనారాయణ నాయుడులతో పాటు వైసిపి నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

**పెద్ద పీఆర్‌సీ తాండాలో..**

పుల్లలచెరువు మండలంలోని పెద్ద పీఆర్‌సి తాండాలో మంగళవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ముందుగా రూ. 71.80 లక్షల వ్యయంతో నిర్మించిన గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, సిమెంట్ రోడ్లను ప్రారంభించారు. అనంతరం గడప గడపకు తిరిగి ప్రజలు పొందిన పథకాల లబ్ధిని వివరించారు. కార్యక్రమంలో ఏఎంసి చైర్మన్ ఉడుముల శ్రీనివాసరెడ్డి, వైసిపి మండల కన్వీనర్ బివి సుబ్బారెడ్డి, ఎంపిపి మందా లాజరు, జడ్పిటిసి వాగ్యా నాయక్, పెద్ద పీఆర్‌సీ తాండా సర్పంచ్ బద్దే నాయక్, డిఎల్‌డివో బివిఎన్ సాయికుమార్, ఎంపిడివో రాజ్యలక్ష్మి, తహశిల్దార్ దాసులతో పాటు వైసిపి నాయకులు, అధికారులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఆదిమూలపు సురేష్

**రెస్టారెంట్ ప్రారంభం**

**పెద్దారవీడు:** మండలంలోని తోకపల్లిలో నూతనంగా ఏర్పాటు చేసిన హెూటల్ శివ సాయి రెస్టారెంట్‌ను రాష్ట్ర పురపాలక మరియు పట్టణాభివద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్, గిద్దలూరు శాసనసభ్యులు అన్నా వెంకటరాంబాబులు మంగళవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి చైర్మన్ ఉడుముల శ్రీనివాసరెడ్డి, మండల కన్వీనర్ పాలిరెడ్డి కష్ణారెడ్డి, జడ్‌పిటిసి ఏరువ చలమారెడ్డి, ఎంపీపీ బెజవాడ పెద్దగురవయ్య, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.